నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 17-1-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 147 | పేజీలు: 4 | వెల: రూ.1/-

దిగివస్తున్న ముడి చమురు ధరలు
తగ్గిన పెట్రో రేట్లు

న్యూఢిల్లీ,జనవరి16(ఆర్ఎన్ఎ): అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గడంతో పెట్రోల్ , డీజిల్ ధరలు గురువారం స్వల్పంగా దిగివచ్చాయి. పెట్రోల్ లీటర్‌కు 15 పైసలు, డీజిల్ లీటర్‌కు 14 పైసల మేర చమురు మార్కెటింగ్ కంపెనీలు తగ్గించడంతో ఆయా నగరాల్లో పెట్రో ధరలు తగ్గుముఖం పట్టాయి. తాజా ధరల ప్రకారం లీటర్ పెట్రోల్ హైదరాబాద్‌లో 16 పైసలు తగ్గి రూ 80.33 పలికింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో రూ 75.55కు దిగివచ్చింది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో రూ 81.14, కోల్‌కతాలో రూ 78.23, చెన్నైలో లీటర్ పెట్రోల్ రూ 72.83 పలికింది. అంతర్జాతీయ అనిశ్చితి, అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో గతంలో బ్యారెల్‌కు 70 డాలర్లకు ఎగబాకిన క్రూడ్ ఆయిల్ ధరలు ఇటీవల 64 డాలర్లకు దిగివచ్చాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రోజువారీ సమీక్ష చేపడుతున్న సంగతి తెలిసిందే.

జైపాల్ రెడ్డికి ఘనంగా నివాళి

ఆయన సేవలను స్మరించుకున్న నేతలు
పాలమూరు ప్రాజెక్ట్‌కు పేరు పెట్టాలన్న చిన్నారెడ్డి

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): దివంగత నేత, మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా జైపాల్ ఘాట్ వద్ద గురువారం ఉదయం కాంగ్రెస్

దివంగత జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా నెక్లెస్‌రోడ్డులో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తదితరులు

తదితర నేతలు నివాళులర్పించారు. మండలి చైర్మన్ గుత్తా, ఉత్తమ్, చిన్నారెడ్డి, కోమటిరెడ్డి, వీహెచ్, రేవంత్‌రెడ్డి, డీఎస్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పల్లంరాజు, నాగం తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా నేతలు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి చొరవ మరువలేనిదని మండలి చైర్మన్ గుత్తా అన్నారు. జైపాల్‌రెడ్డి వల్లే తెలంగాణకు హైదరాబాద్ దక్కిందని, జైపాల్‌రెడ్డి కృషి వల్లే హైదరాబాద్ మెట్రో వచ్చిందని ఆయన గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో దివంగత నేత, మాజీ కేంద్ర మంత్రివర్యులు జైపాల్‌రెడ్డి కృషి మరువలేనిదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నెకల్‌ఎస్ రోడ్డులోని జైపాల్ రెడ్డి మెమోరియల్ వద్ద జైపాల్ రెడ్డి 78వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటం వద్ద పుష్పగుచ్చాలుంచి, నివాళులు అర్పించారు. అనంతరం మండలి చైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో జైపాల్‌రెడ్డి చూపిన చొరవ మరవలేనిదన్నారు. హైదరాబాద్ నగరం తెలంగాణలో ఉండడానికి ఆయన ప్రధాన కారకుడని మండలి చైర్మన్ తెలిపారు. మెట్రోరైల్ హైదరాబాద్ రావడానికి కేంద్రమంత్రిగా ఆయన చేసిన కృషి చాలా గొప్పదన్నారు. బహుభాషా ప్రావీణ్యుడైన ఆయన.. నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని ఆయన అభిప్రాయపడ్డారు. శరీరం సహకరించకున్నా.. దేశ, రాష్ట్ర రాజకీయాలను శాసించారని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. నేటి యువత జైపాల్‌రెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మరోనేత చిన్నారెడ్డి పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో అవినీతి మరక లేని ఏకైక నాయకుడు జైపాల్ రెడ్డి అని కొనియాడారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టుకు జైపాల్ పేరు పెట్టాలని సీఎంను కోరుతున్నానన్నారు. పార్లమెంట్‌లో జైపాల్‌రెడ్డి ప్రసంగాలు తెలంగాణ ఖ్యాతిని పెంచాయని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో జైపాల్ స్పీచ్ కోసం అందరూ ఎదురుచూసేవారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ అన్నారు. రాష్ట్రం వచ్చినా తెలంగాణ లక్ష్యాలు నెరవేరడం లేదని ఆయన విమర్శించారు. జైపాల్ రెడ్డి లేకపోవడం దేశానికే తీరని లోటు అని కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటులో జైపాల్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. తెలంగాణకి అయన లాంటి నేత కావాలన్నారు. ఆయన పదవి ఉన్నా.. లేకున్నా ఒకే విధంగా ఉన్నారని రేవంత్ తెలిపారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు జైపాల్‌రెడ్డి జీవిత చరిత్రని చదవాలన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని జీవితం చివరి వరకు కొనసాగించారన్నారు. సౌత్ ఇండియాలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా జైపాల్‌రెడ్డి ఎన్నికయ్యారని రేవంత్ రెడ్డి కొనియాడారు.

వ్యయసాయ క్షేత్రంలో సిఎం కెసిఆర్
-నేడు హైదరాబాద్‌కు తిరిగి రాక

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): తన వ్యవసాయ క్షేత్రంలో ఎంతో ముచ్చటపడి కట్టించుకున్న కొత్త ఇంట్లో ముఖ్యమంత్రి కేసీఆర్, సంక్రాంతి సంబురాలను జరుపుకున్నారు. ఎర్రవెల్లి ఫాంహౌస్‌లోని కొత్త ఇంట్లో సీఎం కేసీఆర్ ఉన్నారు. గురువారం మూడో రోజు నిద్ర తర్వాత శుక్రవారం హైదరాబాద్ తిరిగి రానున్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు కేసీఆర్ కుటుంబసమేతంగా చేరుకున్నవిషయం తెలిసిందే. అక్కడ పాత గృహాన్ని కూల్చివేసి నిర్మించిన ఇంటికి డిసెంబరులోనే శాస్త్రోక్తంగా గృహప్రవేశం జరిపారు. గృహప్రవేశం చేసిన తర్వాత వచ్చే తొలి పండుగను కొత్త ఇంట్లోనే జరుపుకోవాలని ఆయనకు పండితులు సూచించడంతో సంక్రాంతి వేడుకలను కొత్త ఇంట్లోనే జరుపుకోవాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు.

ఉగ్రవాదాన్ని ప్రేరేపించే దేశాలను ఏకాకి చేయాలి
పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని సహించేది లేదు
ఉగ్రవాద అణచివేతకు అమెరిక చర్యలు భేష్
సిడిఎస్ జనరల్ బిపిన్ రావత్

న్యూఢిల్లీ,జనవరి16(ఆర్ఎన్ఎ): ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశమైన పాకిస్థాన్‌ను సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్ మరోసారి హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని స్పాన్సర్స్ చేస్తున్న ఏ దేశాన్నైనా దౌత్యపరంగా ఒంటరిని చేయడం చాలా ముఖ్యమని, ప్రపంచదేశాలకు ముప్పుగా పరిణమిస్తున్న ఉగ్రవాదంపై సమష్టిగా ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని పోషించే దేశాలున్నంత వరకూ ఉగ్రవాదం బెడద తొలగదని గురువారం నాడిక్కడ అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైసినా డైలాగ్' కార్యక్రమంలో మాట్లాడుతూ బిపిన రావత్ అన్నారు. 'ఉగ్రవాదంపై పోరు కొనసాగించాల్సిందే. కూకటి వేళ్లతో దానిని పెకిలించేంత వరకూ ఆ భయాలతోనే జీవించాల్సి ఉంటుంది. దీనికి చరమగీత పాడాలంటే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న దేశాలను దౌత్యపరంగా ఒంటరిని చేయాలి' అని ఆయన పేర్కొన్నారు. 9/11 దాడుల తర్వాత అమెరికా ఏ విధంగా వ్యవహరించిందో ఆ తరహాలో వ్యవహరించినప్పుడు మాత్రమే ఉగ్రవాదాన్ని తుడిచివేయగలమని, టెర్రరిస్టులను ఒంటరి చేయడం, టెర్రరిజాన్ని స్పాన్స్‌ర్ చేసేవారిని టా÷-గ్గ÷ట్ చేసుకోవడం అనివార్యమని అన్నారు. ఆర్థిక సాయాన్ని నిలిపివేయడం వంటి చర్యలు ఇందుకు ఉపకరిస్తాయని సూచించారు. 'ఇది పాకిస్థాన్‌కు మాత్రమే పరిమితం కాదు, ఇలాంటి దురగాతాలకు పాల్పడుతున్న అన్ని దేశాలకూ వర్తిస్తుంది' అని చెప్పారు. అమెరికా, తాలిబన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య శాంతి ఒప్పదంపై చర్చలకు బిపిన్ రావత్ సమర్థించారు. 'తాలిబన్ ఉగ్రవాదాన్ని నిలిపివేసేందుకు వీలుగా శాంతి ఒప్పందం పై చర్చలు ఉండాలి' అని అన్నారు. రాజకీయ జీవన స్రవంతిలోకి రావాల్సిన అవసరాన్ని వారు (తాలిబన్లు) గుర్తించాలన్నారు. తాత్కాలిక చర్యగా కాకుండా, శాంతిని సుస్థిరం చేసేలాగా సంప్రదింపులు ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా సేనలు కొనసాగాల్సిన అవసరంపై మాట్లాడుతూ, తమ దేశంలో ఉగ్రవాద సంస్థలను ఎదుర్కొనే సత్తాను ఆఫ్ఘన్ భద్రతా బలగాలు సంతరించుకున్నప్పటికీ, ఇప్పటికీ వారికి సపోర్ట్ అవసరముందని బిపిన్ రావత్ అభిప్రాయపడ్డారు.

మున్సిపాలిటీల దశ మారుస్తాం

అనేక కార్యక్రమాలతో అభివృద్ధి పరుస్తాం
నిధులు విడుదల చేసి అభివృద్ధిలో ముందుంచుతా
పార్టీ కేడర్, పోటీ చేస్తున్న అభ్యర్థులతో కెటిఆర్ టెలి కాన్ఫరెన్స్

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): మున్సిపాలిటీల దశదిశను మార్చే విధంగా అనేక కార్యక్రమాలకు రూపకల్పనచేశామని ఐటి,పరిశ్రమల, మున్సిపల్ శాఖ మంత్రి, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఇందుకు అవసరమైన విధంగా నిధులను సమకూర్చనున్నామని అన్నారు. మున్సిపాటిటీల్లో కనీస వసతులను మెరుగు పరచి వాటిని సుందరీకరిస్తామని అన్నారు. టీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్ అభ్యర్థులతో తెలంగాణ భవన్ నుంచి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ ఫలితాలు తమ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తాయని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రచార సరళి, అనుసరించాల్సిన వ్యూహాలపై ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నదన్నారు. రూ.45వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నది ఒక్క టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనని కేటీఆర్ అన్నారు. నిజామాబాద్, సిరిసిల్ల, కోరుట్ల నియోజకవర్గాల్లో ఎక్కువ ఉన్న బీడీ కార్మికులను ఆదుకునేందుకు పెన్షన్లు ఇస్తున్నాం. దేశంలో బీడీ కార్మికులను ఆదుకుంటున్న ఏకైన పార్టీ టీఆర్ఎస్ పార్టీ. పేదింటి ఆడబిడ్డ పెళ్లిళ్ల కోసం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ అందజేస్తున్నాం. కాంగ్రెస్ హయాంలో మున్సిపాలిటీల్లో తక్కువ కరెంట్ ఉండేది. కానీ మున్సిపాలిటీల్లో ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. నాడు, నేడు ఉన్న ప్రజలకు తెలియజేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. మున్సిపాలిటీలకు భారీగా నిధులిచ్చిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ అభ్యర్థులకు మార్గనిర్దేశనం చేశారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పట్టణాల్లో విద్యుత్, మంచినీటి సమస్య లేకుండా చేశాం. 75 గజాల్లోపు ఇంటి నిర్మాణానికి అనుమతులు అవసరం లేదు. 75 గజాల ఇంటి స్థలం ఉన్నవారికి 22 రోజుల్లో అనుమతులు ఇవ్వడం జరుగుతుంది. కొత్త మున్సిపాలిటీ చట్టాన్ని కఠినంగా అమలుచేస్తాం. దేశంలోనే తెలంగాణ మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. మున్సిపాలిటీల్లో 10 శాతం బ్జడెట్ గ్రీనరీ కోసం కేటాయించామన్నారు. ఎక్కడికక్కడా మ్యానిఫెస్టోలు రూపొందించుకుని ప్రచారం చేయండని అభ్యర్థులకు కేటీఆర్ సూచించారు. ప్రతీ ఇంటికి రెండు నుంచి మూడుసార్లు వెళ్లి కలవండి. రాష్ట్రంలో 3వేల వార్డుల్లో పోటీ జరుగుతుంటే బీజేపీకి 1000 వార్డులు, కాంగ్రెస్‌కు 500 వార్డుల్లో అభ్యర్థులే లేరు. బీఫారాలు తీసుకునేందుకు కూడా ఎవరూ ముందుకు రాలేదు. గెలుపు మనదే..అతివిశ్వాసంతో ఉండకుండా ప్రచారాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆదర్శగా సిరిసిల్ల మున్సిపాలిటీ

ఓటు అడిగే హక్కు టిఆర్ఎస్‌కు మాత్రమే ఉంది
ఏకగ్రీవ కౌన్సిలర్లకు మంత్రి కెటిఆర్ అభినందన

రాజన్న సిరిసిల్ల,జనవరి16(ఆర్ఎన్ఎ): సిరిసిల్ల మున్సిపాలిటీని దేశంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లోభాగంగా సిరిసిల్ల మున్సిపాలిటీకి టీఆర్ఎస్ మేనిఫెస్టోను మంత్రి కేటీఆర్ కేటీఆర్ విడుదల చేశారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన నలుగురు కౌన్సిలర్లకు అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ సిరిసిల్లలో ఓటు అడిగే హక్కు ఒక్క టీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. సిరిసిల్లను జిల్లా కేంద్రంగా మార్చడమే కాకుండా జాతీయ స్థాయి అవార్డులు వచ్చేలా తీర్చిదిద్దావన్నారు. సిరిసిల్లకు గోదావరి జలాలు తెచ్చినట్లే.. రెండేళ్లలో రైలు సేవలు కూడా అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. టికెట్ రానివాళ్ల సేవలను గుర్తించి గౌరవిస్తమని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో సిరిసిల్ల రూపురేఖలు మారాయన్నారు. గత ఐదేళ్లలో నేతన్నల వేతనం రెట్టింపు అయ్యేలా చేతినిండా పని కల్పించామని తెలిపారు. అప్పరెల్ పార్క్‌తో స్థానికులకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. త్వంలోనే సిరిసిల్లలో జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటు చేయిస్తామన్నారు. ఇప్పటికే పరకాల, చెన్నూరు మున్సిపాలిటీల్లో దాదాపు గెలిచామని.. త్వరలో భారీ విజయాన్ని అందుకోబోతున్నామని చెప్పారు. రాబోయే వారం రోజులు నాయకులు, కార్యకర్తలు అందరినీ కలుపుకొని పోవాలని, కష్టపడి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. ఇంటింటికి వెళ్ళి ప్రజలను కలిసి ఓట్లు అడగాలన్నారు సూచించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారు ఇతర వార్డుల్లో ప్రచారం చేయాలని దిశానిర్దేశర చేశారు. కారు గుర్తు తో వచ్చే వారినే టీఆర్ఎస్ అభ్యర్థులుగా గుర్తించాలని తాము కూడా టీఆర్ఎస్ అని మభ్యపెట్టేవారి విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పురపాలక పోరులోనూ టీఆర్ఎస్ పార్టీదే విజయమని మంత్రి కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని.. రాబోయే ఐదేళ్లలో రెట్టింపు పని చేస్తామని తెలిపారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజిం చొద్దని సూచించారు. ఎన్నికల్లో ప్రతిపక్షా లకు చెప్పుకునేందుకు ఏమీ లేదన్నారు కేటీఆర్. కాంగ్రెస్ చెయ్యగలిగిం దేమీ లేదని? బీజేపీ కూడా చేసేదేమీ లేదని ఎద్దేవా చేశారు. అడ్డిమారి గుడ్డి దెబ్బ లాగా కరీంనగర్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ గెలుచిం దని ఎద్దేవా చేశారు. కొత్త మున్సిపల్ చట్టంపై పాలకవర్గాలకు శిక్షణ కార్యక్ర మాలు నిర్వహిస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. అవినీతి రహిత పాలన, స్వచ్ఛ పట్టణాలే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గెలిచిన తరువాత పని చేయకపోతే కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లను తొలగించేలా కొత్త చట్టం తెచ్చినట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. పదవులు ఉండడం, పోవడం అనేది మీరు చేసే పనుల మీదే ఆధారపడి ఉందన్న మంత్రి పదవులు పోతే తన బాధ్యత కాదని హెచ్చరించారు. రాబోయే నాలుగేళ్లు ఏ ఎన్నికలు లేనందున పుర పాలన, పరిపాలనే మన లక్ష్యమన్నారు. ఈ ఎన్నికల్లో సిరిసిల్ల జిల్లాలో మాత్రమే ప్రచారం చేస్తానన్న మంత్రి కాంగ్రెస్ నేత కోదండరెడ్డి కోరిక మేరకు రాష్ట్రంలో జరిగే మిగతా చోట్ల ప్రచారం చేయనని తెలిపారు.

ఢిల్లీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నిందితుల ఉరి ఆలస్యం: ప్రకాశ్ జవదేకర్



న్యూఢిల్లీ,జనవరి16(ఆర్ఎన్ఎ): 2012 నిర్భయ కేసులో నలుగురు నిందితుల ఉరిశిక్ష అమలులో జాప్యం కావడానికి కారణం ఢిల్లీ ప్రభుత్వం నిర్లక్ష్యమేనని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఆరోపించారు. నిర్భయ కేసుకు న్యాయం జరుగడంలో అవుతున్న ఆలస్యానికి ఆప్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చురకలంటించారు. ఢిల్లీ ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో నిర్భయ కేసు నిందితులకు క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేసుకునేందుకు ఎందుకు నోటీసులు జారీచేయలేదని ప్రకాశ్ జవదేకర్ ప్రశ్నించారు. ఈ కేసులో దోషులుగా ఉన్న నలుగురు వ్యక్తులు ముఖేశ్(32), పవన్ గుప్తా(25), వినయ్ శర్మ(26), అక్షయ్ కుమార్ సింగ్ (అక్షయ్ ఠాకూర్)(31)పై ఢిల్లీ పాటియాలా హౌస్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి సతీశ్ కుమార్ అరోరా ఇప్పటికే డెత్ వారెంట్ జారీ చేసిన విషయం విదితమే. ఈ 14 రోజుల్లో దోషులు తమ న్యాయపరమైన అవకాశాలు వినియోగించుకోవచ్చని ఈ సందర్భంగా ఢిల్లీ పాటియాలా కోర్టు సూచించింది.

నిర్భయదోషికి ఢిల్లీ సర్కార్ షాక్

న్యూఢిల్లీ,జనవరి16(ఆర్ఎన్ఎ):నిర్భయ దోషికి ఢిల్లీ సర్కార్ షాకిచ్చింది. ముఖేష్ సింగ్ పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తిరస్కరించారు. నిర్భయ దోషులకు బతికే అర్హత లేదన్నఅనిల్ బాజిలాల్.. తిరస్కరణ లేఖను కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ లేఖను పరిశీలించి.. రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. అన్ని సక్రమంగా జరిగితే.. అనుకున్నట్టు గానే జనవరి 22న ఉదయం 7 గంటలకు నలుగురు నిందితులకు ఉరిశిక్ష పడనుంది. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ ఉదంతం దోషుల్లో ఒకడైన ముఖేశ్ సింగ్ పెట్టుకున్న క్షమాభిక్ష విషయంలో ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అతడి క్షమాభిక్షను తిరస్కరిం చాల్సిందిగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా మాట్లాడుతూ.. ముఖేశ్ పిటిషన్‌ను తిరస్కరించాల్సిందిగా ప్రతిపాదనలు పంపినట్లు ధ్రువీకరించారు. కాగా మరణ శిక్ష తప్పించుకునేందుకు 'నిర్భయ' దోషులు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 22న నిర్భయ దోషులకు ఉరిశిక్ష అమలు చేయాలంటూ... డెత్ వారెంట్ జారీ అయిన నేపథ్యంలో... వినయ్ శర్మ(26), ముఖేశ్ సింగ్(32) ఆఖరి ప్రయత్నంగా క్యూరేటివ్ పిటిషన్లను దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన జస్టిస్ ఎన్.వి.రమణ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం(అరుణ్ మిశ్రా, ఆర్ఎఫ్ నారీమణ్, ఆర్ భానుమతి, అశోక్ భూషణ్) వాటిని కొట్టివేసింది. దీంతో ముకేశ్ మంగళవారం క్షమాభిక్ష కోరుతూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆశ్రయించాడు. తన ఉరిశిక్షపై జారీ అయిన డెత్ వారంట్‌ను పక్కన పెట్టాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టుకు విన్నవించాడు. ఈ నేపథ్యంలో

క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరణ

ఒక దోషి క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేసినందున జనవరి 22న ఉరిశిక్ష అమలు జరగదని ఢిల్లీ ప్రభుత్వం స్పష్టం చేసింది. జైళ్ల నిబంధనల ప్రకారం.. ఉరి శిక్షను అమలు చేయలేమని బుధవారం పేర్కొంది. ఇక ప్రొటోకాల్ ప్రకారం.. తొలుత దోషి క్షమాభిక్ష అర్జీని ఢిల్లీ ప్రభుత్వానికి పంపిస్తారు. అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌కు చేరుతుంది. ఆ తర్వాత కేంద్ర హోం శాఖకు పంపిస్తారు. ఈ క్రమంలో అన్ని స్థాయిల్లోనూ అర్జీని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అది దోషి తరపు అర్జీగా రూపాంతరం చెందుతుంది. అనంతరం రాష్ట్రపతికి చేరిన తర్వాత క్షమాభిక్షపై రాష్ట్రపతి తన అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటారు.

తమిళనాడు జల్లికట్టులో విషాదం
జనంపై దూసుకెళ్లిన ఎద్దు: మహిళ మృతి

చెన్నై,జనవరి16(ఆర్ఎన్ఎ): తమిళనాడులోని మధురై జిల్లాలో జల్లికట్టు పోటీలు జోరుగా కొనసాగాయి. అవనియాపురం, అలంగానల్లూరు, పాలమేడులో పోటీలు జరుగుతున్నాయి. తెల్లవారుజామునే జల్లికట్టు ప్రాంగణానికి ఎద్దులు, ఔత్సాహికులు చేరుకున్నారు. పాలమాడులో పోటీల్లో పాల్గొనడానికి 700 ఎద్దులు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయని అధికారులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఎద్దులకు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ పోటీలు కొనసాగుతున్నాయి. రాష్ట్రప్రజలంతా ఈ పోటీలను వీక్షించేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గాయపడిన వారి కోసం వెంటనే వైద్య చికిత్స అందజేసేలా అంబులెన్సులు, ప్రాథమిక వైద్య కేంద్రాలు అందుబాటులో ఉంచారు. బుధవారం జరిగిన జల్లికట్టు పోటీల్లో 32 మంది గాయపడ్డారు.

చరిత్రలో నేటినిజం

కలా॥ సాధకుడికి, నవకుడపరి
శోధకుడికి, ప్రజల మెచ్చు సుశ్లోకుడికా,
యోధుడికా, దేవుండే
మేధాపికి చుట్టి బెంజి మెన్ ఫ్రాంక్లిను గా!!

(జనవరి 17 బెంజిమెన్ ఫ్రాంక్లిన్ జననం)

-రాధశ్రీ

సెల్: 9494481210

విధుల్లో ఉన్న పోలింగ్ సిబ్బందికి ఓటు హక్కు
పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవాలన్న ఇసి

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ప్రాంతాల్లో ఉంటూ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2019లో జరిగిన పంచాయితీ రాజ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్నసిబ్బంది చాలా తక్కువ సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్‌పత్రాల ద్వారా తమ ఓటుహక్కు వినియోగించు కున్నట్టు ఆయన తెలిపారు. కానీ ఈనెల 22న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది , అధికారులు తప్పనిసరిగా తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ వద్ధతిలో వినియోగించు కోవాలని విజ్ఞప్తిచేశారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాలను పొందాలనుకునే వారు తమ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ నుంచి ఫారం-12ను పొంది వివరాలను పొందుపర్చి ఇస్తే వారు పోస్టు ద్వారా తిరిగి బ్యాలెట్ పత్రాన్ని పంపిస్తారని తెలిపారు. తద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారని అన్నారు. ఓటువేసి తర్వాత బ్యాలెట్ పత్రాన్ని కవర్‌లో ఉంచి ఇస్తే కౌంటింగ్ ప్రారంభ సమయంలో వారు సంబంధించి రిటర్నింగ్ అధికారికిఇస్తారు.

మున్సిపల్ ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

ఏజెంట్లు,కౌంటింగ్ ఏజెంట్ల నమోదుకు సూచన
సమస్యాత్మకపోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
మున్సిపల్ ఎన్నికలపై కలెక్టర్ వివరణ

వికారాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): ఈ నెల 22న జరిగే మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ఆయోషా మస్రత్ ఖానం పేర్కొన్నారు. గురువారం మీడియాతో ఆమె మాట్లాడుతూ.. ప్రతి మూడు వార్డులకు ఒక అధికారిని నియమించామని, బిఎల్వో ద్వారా ప్రతి ఓటరుకు ఫోటో ఉన్న ఓటర్ స్లిప్ పంపిణీ చేస్తామన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు త్వరగా ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోస్టల్ ఓటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, నాలుగు మున్సిపాలిటీలలో 228 పోలింగ్ కేంద్రాల్లో 52 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించామన్నారు. ఎన్నికల రోజు స్థానికంగా సెలవు ఉంటుందని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగిం చుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేయడం జరిగిందని కలెక్టర్ అన్నా రు.

ధ్యానం మనకు సమాధానం అందిస్తుంది..!

నేటినిజం
శుక్రవారం 17-1-2020

ధ్యానం అంటే భగవంతునికి పూజ అనుకుంటారు. అది కాదు. పూజ అనేది సమూహంలో చేసేది. కానీ ధ్యానం మాత్రం ఒంటరిగా చేసేది. ఒక వ్యక్తితో మనసువిప్పి మాట్లాడాలంటే మనం మూడో వ్యక్తి ఉన్నా సరిగా మాట్లాడలేము. అలాగే భగవంతునిపై మనసావాచా కర్మణా దృష్టిని కేంద్రీకరించి మనసులోని ఆవేదనలను తెలపడమే కాకుండా మనం చేసిన తప్పుల్ని కూడా ఒప్పుకోగలిగినదే ధ్యానం. ఒక మూర్తిని మనసులో నిలుపుకుని మనం బహిర్గితం అవ్వడమే ధ్యానం అవుతుంది. ఆర్తిలో మనం చేసే ఏ చిన్న ప్రయత్నమైనా అది కీలకపాత్ర పోషిస్తుంది. కారణం అందులో మన తాదాత్మ్యత ఉండితీరుతుంది. ధ్యానం ఒక పరిధిలేని ఒక అనంతం. అడ్డుతెరలు లేని ఏకాంతం. భగవంతుడనే ఒక అవధిలేని ఒక ప్రకాశంతో మనం అయ్యే మమైకం. అపుడు ఆలోచించండి మనలోని మనమే ఉన్నామా? లేక మనతో మరొకరు మిళితమై ఉన్నారా అనే విషయం? మీలో ఇద్దరుంటే అది ధ్యానం మొదటిదశ. మీలోని మరొకరితో కలిసి ఒక్కరై ఉంటే అది ద్యానమే అనేది అంతర్ధశ. మనిషిలోని అంతర్గతమైన దశ ధ్యానం. ఒక అపురూపమైన వరం ధ్యానం. రోజులోని ఇరవైనాలుగు గంటల్లో ఏ క్షణంలోనైనా, ఏ నిముషంలోనైనా, ఏ గంటలోనైనా, ఏ పనిలోనైనా ఏ ప్రక్రియ, క్రియలోనైనా లభించని అమితాశ్చర్యకరమైన, ఆనందకరమైన ప్రక్రియ ఏది? ఆలోచించండి ? మీలోని ఇంతకాలం అనుభవించిన జీవితమా? ఇంతవరకు మీరు సంపాదించిన అనుభవమా? అనుభూతి తత్త్వమా? అదేదీ కాని మీలోని శూన్యమా? అనంతమైన నిశ్శబ్దమా? అదేదో ఏదైనా కానీ దాని తర్వాత ఆ పరమశాంతి ధ్యానం మనకు సమాధానం అందిస్తుంది.

ధ్యానం భగవంతునికి, మనకు మధ్య సాన్నిహిత్యాన్ని, ఏకాంతాన్ని , సాన్నిధ్యాన్ని, ఒక ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరుచుతుంది. మనం ఆయనతో ఏమి చెప్పాలనుకుంటున్నాము? దానికి సరాసరి మార్గాన్ని, అవకాశాన్ని కల్పిస్తుంది. భగవంతునితో మాట్లాడేందుఉ ఆయనకు మన భావాల్ని చేరవేసేటంత వారమా? వాస్తవానికి మనలోని సంఘర్షణను, మనలోని ఆవేదనను, ఆవేశాన్ని, తెలుపుకోవాలంటే భాష సరిపోదు. ఏ అక్షరం సరితూగదు. కేవలం నిశ్శబ్దం తప్ప. ధ్యానగంధం మనలోని దుర్గంధాన్ని పారద్రోలి, మనలోని చిలిపితనాన్ని, అల్లరి తత్వాన్ని దూరంగా పంపి మనలోని మనల్ని బయటకు తీస్తుంది. మన పుట్టుకకు పరమార్థాన్ని బోధిస్తుంది. అన్నింటికంటే మనం అనంతంగా విస్తరింపజేసుకున్న హృదయం భగవంతునికి మనకు జరగబోయే పరమాద్భుత సమాగమనానికి, సంగమానికి వేదిక అవుతుంది. ఇపుడు ఆలోచించండి మనం మనలో ఉన్నామా? లేక మనం అనే పదం 'నేను'లో చేరిపోయిందా? ఆ నేను కాస్త అంతా ఆ పరమాత్ముడే అనే భావనను కలగజేస్తుంది. ఎదుటిగా ఉన్నవారు, బాధిస్తున్న సమస్యలు అన్నీ తీర్చగలడానికి ఎవరికి ఎవరున్నారు? అనే విషయం తేటతెల్లం అవుతుంది. సందేహం దేహదర్మం. ఆ ధర్మాన్ని పూర్తిగా తెలుసుకోవడమే ధ్యానం..!!

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

రెండురోజుల పాటు భారీగా తరలివచ్చిన నగరవాసులు

పల్లెలకు వెళ్లలేకపోయిన వారికి ఆనందం ఇచ్చిన కార్యక్రమాలు

ఆకట్టుకున్న బసవన్నల నృత్యాలు, హరిదాసుల సంకీర్తనలు

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): పల్లె సొగసులు... ప్రకృతి అందాలతో నగర ప్రజలకు ఓ గ్రామీణ ప్రాంతంగా ఆకట్టుకుంటున్న శిల్పారామంలో సంక్రాంతి సందడి నగరవాసులను ఆకట్టుకుంది. గతానికి భిన్నంగా ఈ యేడు నగరంలో పలుచోట్ల సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. శిల్పారామంతో పాటు, నెక్లెస్ రోడ్డులో హూనర్ హాత్, ఎగ్జిబిషన్, పతంగుల పండగ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పట్టణవాసులు ఈ ప్రాంతాలను దర్శించుకుని బాగా ఎంజాయ్ చేశారు. పల్లెలకు వెళ్లలేకపోయిన పట్టణవాసులు సంక్రాంతి వేడుకలను ఇక్కడ ఆస్వాదించారు. భోగిమంటలు, రంగురంగుల రంగవల్లికలతో శిల్పారామం స్వాగతం పలుకింది. బసవన్నల నృత్యాలు, హరిదాసుల సంకీర్తనలతో సందడి సందడిగా మారింది. మంగళ, బుధవారాల్లో శిల్పారామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శిల్పారామంలో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాత్రి వరకు గంగిరెద్దు విన్యాసాలు హైలెట్‌గా నిలిచాయి. నగరంలో ఉన్న ప్రజలకు శిల్పారమం సంక్రాంతి సంబరాలను చేరువ చేసింది. నగరంలో ఉండే తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాన్ని కాపాడేందుకు శిల్పారామం సొసైటీ వారు పల్లెవాతావరణం తలపించేలా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రకృతి పర్యావరణ, సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన శిల్పారామంలో ఉదయం 11గంటల నుంచి గంగిరెద్దుల నృత్యాలు, హరిదాసుల సంకీర్తనలు, బుడగ దేవర నృత్యాలు, బుడబుక్కల వేషధారణలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మెదక్, రంగారెడ్డి జిల్లాల కళాకారులు గంగిరెద్దులతో పలు విన్యాసాలు చేయించి సందర్శకులను ఆకట్టుకుంటున్నారు. ఈ సారి గుస్సాడి నృత్యాలు కూడా బాగా ఆకట్టుకున్నాయి.

సంక్రాంతి ముగ్గులు అందరి మనస్సులు దోచుకున్నాయి. భారీగా పిల్లా పాపలతో తరలిచ్చిన ప్రజలు ఎంజాయ్ చేశారు. నగరం నలుమూలల నుంచి వచ్చే సందర్శకులతో శిల్పారామం కిటకిటలాడింది. భోగి,సంక్రాంతి సందర్భంగా పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో సైబర్‌టవర్ నుంచి హైటెక్స్ కమాన్ వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కు చేశారు. దీంతో శిల్పారామంలో ఎక్కడిక్కడే వాహనాలు రోడ్లపై నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

పండగ చేస్కున్న ఆర్టీసీ,ప్రైవేట్ ట్రాన్స్‌పోర్లర్లు

భారీగా ప్రజలు తరలివరావడంతో పెరిగిన ఆదాయం

తిరుగు ప్రయాణాలకు ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఆదిలాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): నష్టాలతో నడుస్తున్న ఆర్టీసీకి సంక్రాంతి పండుగ సీజన్ లాభాలను తెచ్చిపెట్టింది. ఉన్నత చదువులు, ఉద్యోగాల రీత్యా హైదరాబాద్ స్థిరపడిన పలువురు పండుగ సందర్భంగా తమ స్వస్థలాలకు తరలి రావడంతో ఆదాయం భారీగా సమకూరిందని సమాచారం. దీనికితోడు స్పెషల్ వసూళ్లు కూడా కలసి వచ్చాయి. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో కళాశాలల్లో చదువుకునే యువతీ యువకులు కూడా తమ సొంత గ్రామాలకు తరలిచ్చారు. ఉద్యోగాలు చేసే వారు కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చేరుకున్నారు. ముందస్తు రిజర్వేషన్ చేసుకుని ఆర్టీసీలో ప్రయాణించారు. అయినా సీట్లు దక్కని చాలా మంది ప్రైవేట్ ట్రావెల్స్ ఆశ్రయించారు. ఇదే అదనుగా భావించి రోజూ వారీ ఛార్జీల కంటే ప్రైవేట్ వాహనాల యాజమాన్యాలు ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయడంతో వారికి కూడా బాగా కలసి వచ్చింది. సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఉట్నూర్, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల నుంచి రెగ్యులర్ నడిపే బస్సులతో పాటు అదనపు సర్వీసులను నడిపారు. రెగ్యులర్ నడిచే బస్సుల్లో మినహాయించి అదనంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో 50 శాతం ఛార్జీలను ఆర్టీసీ అధికారులు పెంచారు. దీంతో ఆర్టీసీకి సంక్రాంతి పండుగ రోజుల్లో భారీగా ఆదాయం సమకూరింది. దిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల నుంచి హైదరాబాద్ నుంచి ప్రతి రోజూ నడిచే బస్సులతో పాటు అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగ ముగిసిన అనంతరం 16తేదీ గురువారం నుంచి 20తేదీ వరకు ప్రయాణికులను హైదరాబాద్ చేరవేసేందుకు కూడా అదనపు సర్వీసులను నడుపుతున్నారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్, ఉట్నూర్, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోలకు ప్రతిరోజూ అనేక బస్సులు నడుస్తాయి. పండుగ సందర్భంగా వీటికి అదనంగా బస్సులను నడుపుతున్నారు. ఇందులో ఆదిలాబాద్ , భైంసా, నిర్మల్,ఉట్నూర్ ,ఆసిఫాబాద్ డిపోల బస్సులు నడుపుతున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అప్పటికప్పుడు అదనపు బస్సులు నడిపారు. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు, పామురుకు వెళ్లేందుకు కూడా ప్రత్యేక బస్సులు వేశారు. ఆన్ రిజర్వేషన్ నడుపాయాన్ని కల్పించారు. ఆర్టీసీ బస్ స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతుండడంతో సంక్రాంతి పండుగ రోజుల్లో అధికంగా ఆదాయం సమకూరిందని సమాచారం. సంక్రాంతి పండుగ సీజన్ దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఛార్జీలను అమాంతం పెంచారు. గత్యంతరం లేక అదనపు ఛార్జీలు చెల్లించి ప్రైవేట్ ట్రావెల్స్ స్వగ్రామాలకు చేరుకున్నారు. సంస్థకు వస్తున్న నష్టాలను దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులకు ఛార్జీలు పెంచక తప్పని పరిస్థితి ఉందని ఆర్టీసీ అధికారులు అన్నారు. పండుగకు స్వగ్రామాలకు వద్దామనుకునే వారికి అదనపు ఛార్జీలు భారంగా మారాయి. అయితే ఆర్టీసీ, ప్రైవేట్ సంస్థలకు భారీగా ఆదాయం సమకూర్చింది.

టిఆర్ఎస్ సభ్యులనే ఎన్నుకోండి

-పట్టణాభివృద్ధికి అదే కీలకం: ఎమ్మెల్యే

వేములవాడ,జనవరి16(నేటినిజం ప్రతినిధి) పట్టణాభివృద్ధిలో వార్డు సభ్యులు, ఛైర్మన్ కీలకమని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ అన్నారు. అందువల్ల అధికార టిఆర్ఎస్ అభ్యర్థులను ఎన్నుకోవాలని, టిఆర్ఎస్ అభ్యర్థులే గెలస్తేనే అభివృద్ధి మరింత వేగం కానుందన్నారు.

కాళేశ్వరం నుంచి వరదకాలువలోకి రివర్స్ పంపింగ్ ద్వారా నీరు పంపింగ్ చేయడంతో మేడిపల్లి, కతులాపూర్ మండలాలు సస్యశ్యామలమవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉందనీ, పార్టీకి చెందినవారే గెలిస్తేనే వేములవాడను మరింత అభివృద్ధి జరుగుతుందని అన్నారు. టీఆర్ పార్టీకి చెందిన వారిని పట్టణ వార్డు సభ్యులుగా గెలుపించుటకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారు. దేశంలోనే సీఎం కేసీఆర్ పాలన ఆదర్శమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల కోసం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై టీఆర్ పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుపరిచి ప్రజలకు అండగా నిలిచింది టీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. ప్రపంచంలోనే సీఎం కేసీఆర్ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టారన్నారు. ప్రజల కోసం పని చేసే పార్టీ వైపే ప్రజలు ఉంటారని, ప్రజల ఓట్లతో గెలిచి పట్టించుకోని నాయకుల వెంట ప్రజానికం ఉండరన్నారు. ఈఎన్నికల్లో పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థులను అఖండ విజయంతో గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

బిజెపిని మరింత బలోపేతం చేస్తున్న పౌరచట్టం

హైదరాబాద్, జనవరి 16:పౌరసత్వ చట్టం, ఇతర అంశాల గురించి దేశవ్యాప్తంగా వివిధ రాజకీయవర్గాలు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నప్పటికీ, విపక్షాలకు మంచికన్నా కీడే ఎక్కువగా కలుగనుంది. ఈ విషయంలో కాంగ్రెస్,లెఫ్ట్ తదితర పార్టీలు చేస్తున్న ఆందోళనల్లో అర్థం లేదన్న విషయం ప్రజలు మెల్లగా గ్రహిస్తున్నారు. దేశంలో ఉన్న ఏ పౌరుడికీ ఈ చట్టంతో ఇబ్బంది లేదు. కానీ ముస్లింలకు వ్యతిరేకం అన్న ప్రచారం చేస్తూ లబ్ది పొందాలని, అందుకు రకరకాలుగా ఆందోళనలకు దిగారు. ఇది దేశ వ్యతిరేకమన్నప్రచారం సాగించారు. కేరళ ప్రభుత్వం అయితే సుప్రీంలో సవాలు చేసింది. దీనికి వ్యతిరేకంగా బెంగాల్ సిఎం మమతా బెనర్జీ మొండి పట్టుతో పోరాడుతోంది. అయితే ఇదంతా రాజకీయంగా చేస్తున్న విన్యాసాలుగా ప్రజలు గుర్తిస్తు న్నారు. సోషల్ మీడియాలో చట్టంపై అసలు విషయాలను బాగా ప్రాచుర్యం సాగుతోంది. దీంతో సామాన్య లకు సైలం భారత రాజకీయ పార్టీల కుత్సిత బుద్ధి బయటపడింది. వారిని తమకు అనుకూలంగా మార్చుకో గలిగిన శక్తి బిజెపియేతర రాజకీయ పార్టీలకు ఉన్నదా అన్న సందేహం కలుగుతోంది. గతంలో రాజకీయ పార్టీలు ప్రజాసమస్యలపై పోరాటాలు నిర్వహిస్తే, ఇవాళ ప్రజలు నిర్వహించే పోరాటాలకు రాజకీయ పార్టీల నేతలు వెళ్లి తమ అస్తిత్వాన్ని చాటుకోవల్సివస్తున్నది. హైదరాబాద్‌లో ఎంఐఎం అయితే ముస్లింలతో కలసి పెద్ద ఎత్తున తిరంగా యాత్ర నిర్వహించింది. మరిన్ని ఆందోలనలు చేయబోతున్నామని ప్రకటించింది. వందేమాతరం, జనగణమనలను వ్యతిరేకించే పార్టీ తిరంగా యాత్రను నిర్వహించడం విశేషం. ఇవాళ్టికి కూడా ఆరెస్సెస్ బిజెపికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. పౌరసత్వ చట్టానికి దేశంలో అనేక చోట్ల నిరసన ప్రదర్శనలు జరుగుతున్న సమయంలో బిజెపికి అండగా ఆరెస్సెస్ నిలిచింది.

ఈ విషయంలో వెనక్కు తగ్గవద్దని, ఆరెస్సెస్ కార్యకర్తలంతా ప్రభుత్వానికి పూర్తిగా అండగా నిలుస్తున్నారు.ఆ తర్వాతే పౌరసత్వ చట్టంపై వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని మోదీ, అమిత్ షా స్పష్టంగా చెప్పారు. పౌరసత్వం ఇచ్చేందుకు కానీ తీసేందుకు కాదని ప్రదాని మోదీ పదేపదే చెబుతూనే ఉన్నారు. ఇవాళ దేశవ్యాప్తంగా మోదీ సర్కార్‌కు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మళ్లించేందుకు ఆరెస్సెస్ ఉధృతంగా కృషి చేస్తోంది. వాట్సాప్‌ల్లోనూ, ఇతర సోషల్ మీడియాల్లోనూ సంఘ్, దాని సానుభూతిపరుల ధాటికి తట్టుకోవడం ఇతర సంస్థలకు తలకు మించిన భారంగా పరిణమించింది. ఇక ఇటీవల జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి ఓడినా ప్రజల్లో మాత్రం దానిపట్ల ప్రాభవం తగ్గలేదు. బిజెపిని ప్రేమించే వారు పెరుగుతున్నారు. వివిధ చట్టాల విషయంలో తీసుకున్న పాహసోపేత నిర్ణయాలను సమర్థిస్తున్నారు. గతంలో జరిగిన నిర్ణయాలు, తాజాగా ప్రభుత్వం బిజెపి తీసుకుంటున్న నిర్ణయాలను బేరీజు వేసుకుని చర్చిస్తున్నారు. ఇకపోతే పలు రాష్ట్రాల్లో బిజెపి ఓడిపోయినా ప్రజల నుంచి మాత్రం ఆ పార్టీ దూరం కావడం లేదు. తాజాగా ఆ పార్టీ మరింత బలోపేతం అయ్యేలా విపక్షాల కార్యక్రమాలు ఉంటున్నాయి. భారతీయ జనతా పార్టీ అధ్యక్ష పీఠాన్ని జగత్ ప్రకాశ్ నడ్డా త్వరలో చేపట్టనున్నారు. బిజెపిలో వంశపారంపర్య రాజకీయాలకు చోటు లేదు. ఇటీవల ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వంశపారంపర్య రాజకీయాలను వ్యతిరేకిస్తూ వ్యాఖ్యానించారు. ఆయన కుటుంబమే ఇందుకు నిదర్శనంగా చూడాలి. ఇకపోతే పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్‌గా కొనసాగుతున్న నడ్డా పూర్తి స్థాయి అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తించబోతున్నారు. ఆయనకు కూడా పార్టీలో ఎలాంటి కుటుంబ నేపథ్యం లేదు. భారతీయ జనతా పార్టీలో ఏ పార్టీకి లేని ఓ ప్రత్యేకత ఉన్నది. ఆ పార్టీలో ఎవరూ జీవితకాలం వరకూ పార్టీ అధ్యక్షుడుగా ఉండడానికి అవకాశం లేదు. వారసత్వం ప్రకారం పార్టీ పగ్గాలు చేపట్టే అవకాశం కూడా ఆ పార్టీలో లేదు. 1980లో పార్టీ ఆవిర్భవించిననాటి నుంచీ ఇప్పటికి 10మంది ఆ పార్టీకి అధ్యక్షులుగా పనిచేశారు. వారంతా ఎవరికి వారు తమ సమర్థతో వచ్చినవారే. అతి క్రింది స్థాయి నుంచి పనిచేసి పైస్థాయి వరకు ఎదిగిన వారే. అడ్వాణీ, వాజపేయిలిద్దరూ కూడా ఆరెస్సెస్ ప్రచారక్ స్థాయి నుంచి పార్టీ అధ్యక్షులుగా ఎదిగారు. కుశభావు ఠాక్రే బంగారు లక్ష్మణ్, జానా కృష్ణమూర్తి తదితరులకు సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నేపథ్యం ఉన్నది. కుశభావు ఠాక్రే పార్టీ అధ్యక్షుడైన తర్వాత కూడా తన దుస్తులు తానే ఉతుక్కునేవారు. అడ్వాణీ, వాజపేయి పోస్టర్లు అతికించే స్థాయి నుంచి వారిద్దరి మధ్యా పార్టీ అధ్యక్షుడిలా కూర్చునే స్థాయికి చేరుకున్నానని వెంకయ్యనాయుడు ఒక సందర్భంలో చెప్పారు. తాను బూత్ కమిటీ సభ్యుడి నుంచి పార్టీ అధ్యక్షుడయ్యే వరకూ ఎదిగానని ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు, హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. త్వరలో పగ్గాలు చేపట్టే జగత్ ప్రకాశ్ నడ్డా కూడా ఏబీవీపీ కార్యకర్త స్థాయి నుంచి క్రమంగా ఎదిగిన వారే. బీహార్‌లో జేపి ఉద్యమంలో పాల్గొని విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎంపికైన నేపథ్యం ఆయనకున్నది. ఇతర పార్టీలన్నీ సంస్థాపరంగా బలహీనం అవుతున్న తరుణంలో బిజెపి అధ్యక్షుడైన అమిత్ షా గత ఆరేళ్లలో దాన్ని బలోపేతమైన పార్టీగా నిర్మించారు. పార్టీ సానుభూతిపరులను, ఓటర్లను సభ్యులుగా, సభ్యులను క్రియాశీలక సభ్యులుగా మార్చేందుకు ఒక పద్ధతి ప్రకారం కృషి చేసినందువల్లే బిజెపికి ఇవాళ బలమైన నిర్మాణం ఏర్పడింది. కొన్నిచోట్ల కాంగ్రెస్‌లో ఓటర్ల కంటే పార్టీ సభ్యులే ఎక్కువ సంఖ్యలో ఉంటే బిజెపికి పార్టీ సభ్యుల కంటే ఓటర్లే ఎక్కువ ఉన్నారని తేలింది. ఇది సంస్థ బలోపేతమవుతున్నదనడానికి తార్కాణం.ఈ నేపథ్యంలో పౌరసత్వ చట్టం, ఇతర అంశాల గురించి దేశవ్యాప్తంగా వివిధ వర్గాలు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న ప్పటికీ వారిని తమకు అనుకూలంగా మార్చుకోగలిగిన శక్తి బిజెపియేతర రాజకీయ పార్టీలకు ఉన్నదా అన్న సందేహం కలుగుతోంది. యూనివర్సిటీలల్లో విద్యార్థులు, మురికివాడల్లో ప్రజలు ఏదో ఒక రూపంలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వాటిని పట్టుకుని ఆయా పార్టీలు వేలాడుతున్నాయి.

సాగునీటి రంగంపై సిఎం ప్రత్యేక దృష్టి

చేపట్టిన ప్రాజెక్టులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు

శాశ్వత కరవు నివారణ కోసం యత్నాలు

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ)తెలంగాణ రాష్ట్రానికి శాశ్వత ప్రయోజనం కలిగే రీతిలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సాగుతున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తు రూపకల్పనలో భాగంగానే ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ పదేపదే స్పష్టం చేశారు. ప్రాజెక్టుల పురోగతి, నదుల అనుసంధానంపై ఎప్పటికప్పుడు చస్తున్నారు. రాష్ట్రానికి శాశ్వత ప్రయోజనం కలిగేలా కాల్వలు, చెక్ డ్యామ్‌లను నిర్మించాలని సూచించారు. పూర్తి స్థాయిలో చెరువులు నింపుకొనేందుకు సమగ్ర అధ్యయనం చేయాలన్నారు.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టే నిర్మాణాలతో పాటు రిజర్వాయర్ల స్థలాల్లో వసతిగృహాల నిర్మాణం వంటి అంశాలపైనా సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. గోదావరి నదిపై కడుతున్న బ్యారేజీల వల్ల ఉత్తర కరీంనగర్ జీవధారగా అవుతుందన్నారు. సింగూర్ నిండితే మెదక్ జిల్లాకు మెతుకుసీమ పేరు సార్థకమవుతుందని తెలిపారు. మిడ్‌మానేరు నింపడంతో ఆప్రాంతం సత్యశ్యామలం అవుతుందని ముఖ్యమంత్రికి తెలిపారు. ఎస్సారెస్పీ ఎప్పటికీ నిండి నీళ్లతో ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టుపై మిషన్ భగీరథ ఆధారపడి ఉందని, మిడ్ మానేరు నీళ్లు వచ్చే నాటికి బ్యారేజీలన్నీ పూర్తికావాలని సూచించారు. మిడ్‌మానేరు నుంచి అనంతగిరి వరకు ఓపెన్ ఛానల్ పూర్తయిందని, మిగిలిపోయిన టన్నెల్ పనులు సైతం త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతగిరి, రంగనాయక్ సాగర్ రిజర్వాయర్ల పనుల్ని వేగవంతం చేయాలని నిర్ణయించారు. అదే తరహాలో కాల్వల నిర్మాణం, చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువులు నింపుకోవడానికి ఏర్పాట్లు కూడా జరగాలన్నారు. తదనుగుణంగా వివరంగా అధ్యయనం చేసి పనులు చేపట్టాలి.అప్పర్ మానేరు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండిపోయే అవకాశం లేదు. అప్పర్ మానేరు నుంచి లోయన్ మానేరు ఒక జీవధార లాంటిది. ఇప్పుడు జరుగుతున్న పనులు పురోగతి సాధిస్తున్న కొద్దీ కరీంనగర్ జిల్లా దక్షిణ ప్రాంతం ఎప్పుడూ సజీవంగా ఉంటుంది. కాకతీయ కాలువ మరో జీవధార. గోదావరి మీద కడుతున్న బారేజీల వల్ల ఉత్తర కరీంనగర్ కూడా ఒక జీవధార లాగా అవుతుంది. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే వివిధ రకాల సాగునీరు అందడం వల్ల నాలుగు జీవధారలు ఎల్లప్పుడూ ఉంటాయి. దీనివల్ల ఎప్పుడు పచ్చదనంతో పాటు హరితహారానికి కూడా మేలు జరుగుతుందని భావిస్తున్నారు. అలాగే సింగూరు ఒక్కసారి నిండితే ఐదు సంవత్సరాల దాకా ఇబ్బంది ఉండదు. సింగూర్ నుంచి కొండపోచమ్మ, మల్లన్నసాగర్ వరకు జీవధారే. దీని వల్ల మెదక్ జిల్లాకున్న మెతుకుసీమ అనే పేరు సార్థకమవుతుంది. ఈ ఏడాది జులై – ఆగస్టు నాటికి మిడ్ మానేరు నింపడం సాధ్యమవుతుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎప్పటికీ నిండి నీళ్లతో ఉండాల్సిన అవసరం ఉంది. దీనిమీదే మిషన్ భగీరథ ఆధారపడి ఉంది. మిడ్‌మానేరు నీళ్లు వచ్చే సరికి బ్యారేజీలన్ని పూర్తి కావాలి. మిడ్‌మానేరు నుంచి అనంతగిరి వరకు ఓపెన్ ఛానెల్ పూర్తి అయింది. మిగిలిపోయిన టన్నెల్ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతగిరి, రంగనాయక్‌సాగర్ రిజర్వాయర్ల పనులు కూడా వేగవంతం చేయాలి. కరువు ప్రాంతాలు సస్యశ్యామలం కావడానికి ఎంత త్వరగా వీలుంటే అంత త్వరగా సాగునీరు ఇవ్వాలి. నీళ్లు వచ్చిన వెంటనే చెరువులు నింపుకుంటూ పోవాలి. వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి ఉపయోగంలోని రావాలంటే చెరువులు నింపడం తప్పనిసరని స్పష్టం చేశారు. జాతీయరహదారి నుంచి మెదక్ పట్టణం వరకు అలాగే గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో ఒక్క గుంట భూమి కూడా మిగలకుండా సాగులోకి రావాలి. గంధమల, బస్వాపూర్ రిజర్వాయర్లు ఎంత త్వరగా పూర్తయితే అంత త్వరగా ఫలితాలుంటాయి. మొత్తం తెలంగాణలో ఉన్న మంజీరా, దుంధుబి, కనగల్‌వాగు, మూసీ, పాకాల లాంటి ఉపనదుల మీద చెక్‌డ్యాంల నిర్మాణం జరగాలి. ఒక్కసారి ఈ చెక్‌డ్యాంలు, చెరువులు పూర్తిగా నిండితే చాలు ఇక ఎప్పుడూ ఆ నీరు సర్క్యులేట్ అవుతూ ఉంటే పంటలు పండుతుంటాయి. ప్రాజెక్టులు పూర్తయితే అనుకున్న తెలంగాణ వస్తుంది. అంతా అద్భుతంగా ఉండబోతున్నదని కెసిఆర్ భావిస్తున్నారు.

పండగపూట ఎన్నికల ప్రేమలు

మున్సిపల్ ఎన్నికలతో పట్టణ ప్రాంతాల్లో కోలాహలం

ఆంధ్రాలో రాజధాని తరలింపు రాజకీయాలు

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): గతంలో కంటే ఈసారి ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొన్నది. ఓ వైపు సంక్రాంతి సంబురాలు.. మరోవైపు మున్సిపల్ ఎన్నికల ముచ్చట్లు.. ఆంధ్రాలో అయితే రాజధాని అమరావతి తరలింపు వ్యవహారాలు మొత్తంగా గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు సరదగా గడిచాయి. ఎక్కడెక్కడి నుంచో సొంతూళ్లకు చేరుకున్న పట్టణవాసులను అభ్యర్థులు ఆత్మీయంగా పలుకరిస్తూ.. కనిపించారు. ఇక తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పట్టణప్రాంతాలుల, శివారు ప్రాంతాల గ్రామాల్లో ఓటర్లను ఆకట్టుకోవడం కనిపించింది. ఇటు సొంత ఖర్చులతో ముగ్గులు, క్రీడా పోటీలు, ప్రత్యేక దావత్‌లు ఏర్పాటు చేయగా, ఏ ఇంట చూసినా ఎన్నికలపైనే చర్చ సాగడం సంక్రాంతి పండగ ప్రత్యేకంగా మారింది. ఎక్కడా చూసినా సరికొత్త శోభను తీసుకవస్తున్నాయి. మరోవైపు రాజకీయ పందెంకోళ్లు కాకరేపుతున్నాయి. ప్రచార గోదాలోకి దిగి సై అంటే సై అన్నాయి. పండుగ వేళ సొంతూళ్లకు చేరుతున్న ఓటర్లను కలిసి ఆత్మీయంగా పలకరిస్తూనే మరోవైపు ఓట్లను అభ్యర్థిస్తున్న సన్నివేశాలే దర్శనమిచ్చాయి. మరికొందరు ఇంకో అడుగు ముందుకేసి సొంత ఖర్చులతో వేడుకలను నిర్వహిస్తూ.. క్రీడా, ముగ్గుల పోటీలను ఏర్పాట్లు చేసి ప్రోత్సహించారు. దీంతో పల్లెల్లో సంక్రాంతి పండుగ సందడి రెట్టింపుగా ఆకట్టుకుంది. గంగిరెద్దుల విన్యాసాలు.. భోగిమంటలు.. పిండివంటల ఘుమఘుమలకు తోడు మున్సిపల్ ఎన్నికలు, సంక్రాంతి సంబురాలను రెట్టింపు చేసింది. పట్టణాలకు ఆనుకుని ఉన్న శివారుగ్రామాలను విలీనం చేయడం, కొత్తగా అనేక పంచాయితీలు మున్సిపాలిటీలుగా మార్చడంతో పెద్ద గ్రామాలు కాస్తా మున్సిపాలిటీలుగా అవతరించాయి. దీనికితోడు పురపాలికలకు పెద్ద ఎత్తున నిధులు, విధులు, బాధ్యతలు అప్పగించడంతో బరిలో నిలిచేందుకు ఎక్కువ మంది ఆసక్తి చ

అప్పుల బాధతో నవదంపతుల ఆత్మహత్య

మేడ్చల్,జనవరి16(ఆర్ఎన్ఎ): బోడుప్పల్ లోని సాయిరాం కాలనీలో విషాదం చోటు చేసుకుంది. కడప జిల్లాకు చెందిన అక్షిత్(26), ఆయన భార్య చైతన్య(24) బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చారు. మేడ్చల్ జిల్లాలోని బోడుప్పల్ సాయిరాం కాలనీలో నివాసం ఉంటున్నారు. కాగా, ఇటీవల వారు ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో గత్యంతరం లేక ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ దంపతులకు నెల రోజుల క్రితమే కుమార్తె జన్మించింది. పాప ఏడుపుతో విషయం గ్రహించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. దంపతుల ఆత్మహత్యపై స్థానికులను ఆరా తీశారు. స్థానికులు మాత్రం వారెప్పుడూ కలివిడిగానే ఉండే వారనీ.. నెల రోజుల క్రితమే కూతురు జన్మించినందుకు ఆనందంగానూ ఉన్నారని వారు తెలిపారు. ఇంతలోనే ఈ ఘోరం జరగడం, పాప అనాథ కావడం స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. పోలీసులు మృతుల కుటుంబీకులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

కరెన్సీపై లక్ష్మీదేవి బొమ్మ ముద్రించాలి

-ఎంపి సుబ్రమణ్యస్వామి ట్వీట్

న్యూఢిల్లీ,జనవరి16(ఆర్ఎన్ఎ): వివాదాస్పద వ్యాఖ్యలకు కేరాఫ్ అడ్రస్ అయిన భారతీయ జనతా పార్టీ ఎంపీ సుబ్రమణ్య స్వామి మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత కరెన్సీ నోట్లపై లక్ష్మీదేవి బొమ్మను ముద్రించాలని ఆయన ట్విట్టర్ ద్వారా తెలిపాడు. భారత ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలంటే అక్ష్మీదేవి బొమ్మను నోట్లపై ముద్రించాలన్నారు. ఇండోనేషియా కూడా గణెశిషుడి బొమ్మను వారి కరెన్సీ నోట్లపై ముద్రించిందని ఆయన గుర్తు చేశారు. కాగా, ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం రేపుతున్నాయి. సుబ్రమణ్యస్వామి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. బీజేపీ మతతత్వ పార్టీ అనడానికి ఇదొక నిదర్శనం అని విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ సందర్భాన్ని ఉటంకిస్తూ ఎన్ఆర్సీ, సీఏఏను ఉదాహరణగా చూపిస్తున్నాయి విపక్షాలు. ఆయన మాత్రం సిటిజన్ షిప్ యాక్ట్ కు, దీనివల్ల ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆయన అన్నారు. ఇంతకు ముందు కూడా ఆయన చాలా సందర్భాల్లో వివాస్పద వ్యాఖ్యలు చేసి విమర్శల పాలయిన విషయం తెలిసిందే.

పట్టాలు తప్పిన ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్

50మంది ప్రయాణికులకు గాయాలు

భువనేశ్వర్,జనవరి16(ఆర్ఎన్ఎ): ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం తప్పింది. నిర్గుండి వద్ద ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో ఆరు బోగీలు పక్కకు ఒరిగాయి. ఈ ప్రమాదంలో 50 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కటక్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పొగమంచు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ముంబయి నుంచి భువనేశ్వర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ రైలు ప్రమాదంతో ఆ మార్గంలో పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రష్మిక ఇంట్లో ఐటి సోదాలు

బెంగళూరు,జనవరి16(ఆర్ఎన్ఎ): సెన్సేషనల్ నటి రష్మిక మందాన్నా ఇంట్లో ఇన్ కమ్ ట్యాక్స్ అధికారులు సోదాలు చేపట్టారు. కొడగు జిల్లా, విరాటోపేటలోని రష్మిక ఇంట్లో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఇటీవల రష్మిక వరుస సినిమాలతో పాపులర్ అయిన విషయం తెలిసిందే. ఛలోతో ప్రారంభమైన తన సినీ కేరీర్.. విజయ్ దేవరకోండతో నటించిన గీతగోవిందంతో మరో లెవెల్‌లోకి వెళ్లింది. అనంతరం డియర్ కామ్రేడ్‌తో మరో హిట్ అందుకున్న రష్మిక.. సంక్రాంతి బరిలో నిలిచిన మహేష్ బాబు సరిలేరు నీకెవ్వరు సనిమాలో నూ హీరోయిన్‌గా నటించింది. కాగా, ఐటీ సోదాలకు సంబంధించి అధికారులు గానీ, రష్మిక గానీ స్పందించలేరు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్టీసీని బతికించుకోవాలి

-బస్సులో ప్రయాణించిన మందకృష్ణ

సూర్యాపేట,జనవరి16(ఆర్ఎన్ఎ): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తాజాగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఆర్టీసీ పరిరక్షణ యాత్రను చేపట్టిన ఆయన హైదరాబాద్ నుంచి భద్రాచలం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సష్టాల్లో ఉన్న ఆర్టీసీ బతకాలంటే ప్రతి ఒక్కరు సొంత వాహనాలను వదిలి ఆర్టీసీలో ప్రయాణించాలన్నారు. ఆర్టీసీ సమ్మె కాలంలో కార్మికులకు మద్దతు ఇచ్చినట్లుగానే ఆర్టీసీని బతికించేందుకు ఇప్పుడు బస్సులో ప్రయాణం చేస్తున్నా. లోటు బ్జడెట్ ఉన్న ఆంధ్రాలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పుడు.. ఇక్కడ ఎందుకు సాధ్యంకాదు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి' అని కోరారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడంలో భాగంగానే సీఎం కేసీఆర్ ఉద్యోగ సంఘాలను నిర్వీర్యం చేస్తున్నారని, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు మంత్రులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలన్న కేసీఆర్ మాటలు ఎక్కడా కార్యరూపం దాల్చలేదని తప్పుబట్టారు.

పిల్లలతో కలసి పతంగులు ఎగురేసిన అమెజాన్ సిఇవో

న్యూఢిల్లీ,జనవరి16(ఆర్ఎన్ఎ): ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన అమెజాన్ వ్యవస్థాపకుడు, సీఈఓ జెఫ్ బెజోస్ ప్రస్తుతం మూడు రోజుల భారత్ పర్యటనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో మకర సంక్రాంతి సందర్భంగా ఢిల్లీలో పిల్లల మధ్య పతంగులు ఎగురవేశారు. ఈ సందర్భంగా బెజోస్‌ను ఒక పిల్లాడు 'మీరు ఇంతకు ముందు ఎప్పుడైనా పంతంగులు ఎగురవేశారా? అని అడిగాడు. దీనికి ఆయన సమాధానమిస్తూ 'నేను పిల్లవాడిగా ఉన్నప్పుడు పతంగులు ఎగవేశాను. చాలా కాలం తరువాత ఇప్పుడు బాల్య స్మృతులు గుర్తుకు వస్తున్నాయి' అని అన్నారు. మరో చిన్నారి 'మీరు ఇటువంటి వాటిని మిస్సవుతున్నారా?' అని అడిగాడు. దీనికి ఆయన సమాధానిమిస్తూ 'అవును' అని అన్నారు.

మూడు మున్సిపాలిటీలపై మంత్రి పువ్వాడ గురి

-ఎమ్మెల్యేలతో కలసి ప్రచారంలో ముందుకు

ఖమ్మం,జనవరి16(ఆర్ఎన్ఎ): ఖమ్మం జిల్లాలో ఎన్నికలు జరగనున్న మూడు మున్సిపాలిటీలలో అధికార టీఆర్ఎస్ తన వ్యూహాలకు పదను పెట్టింది. ప్రధానంగా మంత్రి పువ్వాడకు తోడు స్థానిక ఎమ్మెల్యేలు, జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు ప్రచారంపై దృష్టి సారించారు.

జిల్లాలో మధిర, వైరా, సత్తుపల్లి మున్సిపాలిటీలకు ఈ నెల 22వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. 14వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. మంగళవారం సాయంత్రం నాటికి వైరాలో 40 మంది, మధిరలో 48 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మూడు మున్సిపాలిటీ లలోనూ టీఆర్ఎస్ ఎదురులేని శక్తిగా నిలిచే అవకాశాలున్నట్లు తెలుస్తుంది.

ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు ప్రధాన బాధ్యతగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగింది. సత్తుపల్లి మున్సిపాలిటీలో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, వైరాలో లావుడ్యా రాములునాయక్, మధిరలో జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు మున్సిపాలిటీల బాధ్యతలను తమ భుజస్కాందలపై వేసుకున్నారు.

నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసేటప్పటికే టీఆర్ఎస్ ఖమ్మం జిల్లాలో 7 వార్డులను ఏకగ్రీవం చేసుకుంది. దీంతో మూడు మున్సిపాలిటీలలోను టీఆర్ఎస్ విజయం నల్లేరుపై నడకలా మారింది. సత్తుపల్లి మున్సిపాలిటీలలో 23 వార్డులకు గాను 6 వార్డులను టీఆర్ఎస్ ఏకగ్రీవం చేసుకోగా, మిగిలిన 17 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 49 మంది అభ్యర్థులు వివిధ పార్టీల నుంచి రంగంలో నిలిచారు. వైరా మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులకుగాను ఒక వార్డును టీఆర్ఎస్ ఏకగ్రీవం చేసుకుంది. మిగిలిన 19 వార్డులకు ఎన్నికలు జరగనుండగా ఇక్కడ 73 మంది అభ్యర్థులు రంగంలో నిలిచారు. మధిర మున్సిపాలిటీలో 22 వార్డులకు గాను 67 మంది అభ్యర్థులు రంగంలో నిలిచారు. మూడు మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్న 58 వార్డులకు 189 మంది అభ్యర్థులు రంగంలో నిలవడం జరిగింది.

ప్రచారంపై ప్రధాన పార్టీల దృష్టి

కాంగ్రెస్,బిజెపిల్లో సద్దుమణగని అసంతృప్తి

కామారెడ్డి,జనవరి16(ఆర్ఎన్ఎ): సంక్రాంతి ముగియడంతో ప్రధాన పార్టీల నేతలు ప్రచారంపై దీష్టి పెట్టారు. అధికార పార్టీ నేతలు ఇప్పటికే ఓ అడుగు ముందుకేసి ప్రచారంలో దూసుకుని పోతున్నారు. ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ పోచారం కూడా ప్రచారంలో శ్రేణులకు స్ఫూర్తిని ఇస్తూ ముందుకు సాగారు. ఇకపోతే కాంగ్రెస్, బిజెపిల్లో టిక్కెట్ల గొడవ ఎటు దారితీస్తుందో అన్న ఆందోళన ఆయా పార్టీల్లో ఉంది.

కౌన్సిలర్ టికెట్ల అంశం కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో అగ్గి రాజేసింది. బీ-ఫారాలు అందని నాయకులంతా సొంత పార్టీ నేతలపైనే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టికెట్లను అంగట్లో సరుకులు అమ్ముకున్నట్లు ఆరోపించారు. ఈ వ్యవయమారం తమకు అనుకూలంకానుందని టిఆర్ఎస్ నేతలు భరోసాగా ఉన్నారు. అడ్డదారి నుంచి వచ్చిన వారికి టికెట్లు అందించారంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులైతే పీసీసీ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ, ఆయన సోదరుడు నయీం, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. బీ-ఫారాల ముసుగులో కాంగ్రెస్ పార్టీ నేతలే తమను నయవంచనకు గురి చేశారంటూ పలువురు తీవ్రంగా ఆవేదన చెందారు. దశాబ్దాలుగా పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించకుండా డబ్బులున్న వారికే టికెట్లు ఇచ్చారంటూ దుర్భాషలాడారు. బీజేపీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి పై అసంతృప్త నేతలంతా కలిసి మూకుమ్మడిగా దాడి చేశారు. టికెట్లు ఇవ్వనందుకు గాను ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ టీఆర్ఎస్‌లో అసంతృప్తి నేతలంతా ముఖ్య నాయకుల ఆదేశాలను శిరసా వహించి, తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. ఇకపోతే డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ స్వయంగా పైసల్ తీసుకుని బీ-ఫారాలు అందజేశారంటూ పలువురు నాయకులు ఆరోపించారు. ఇక బిజెపిలోనూ విభేదాలు భగ్గుమన్నాయి. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి తమకు ద్రోహం చేశారంటూ బీజేపీ నేతలు పెద్ద ఎత్తున వ్యతిరేక నినాదాలు చేశారు. మొత్తంగా గొడవ సద్దు మణిగినా టిక్కెట్లు దక్కని వారు ఓటమికి సాయంగా నిలుస్తురన్న ఆందోళన ఉంది.

. హుజరాబాద్ మున్సిపాలిటీలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి ఈటెల రాజేందర్

ఉమ్మడి కరీంనగర్‌లో జోరుగా ప్రచారం

టిఆర్ఎస్ అభివృద్ధిని వివరిస్తూ నేతల దూకుడు
విపక్ష పార్టీలకు ఓటేస్తే లాభం లేదు
అభివృద్ధి జరగాలంటే టిఆర్ఎస్‌కు ఓటేయాలన్న ఈటెల

కరీంనగర్,జనవరి16(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం అమలు చేసే పథకాలు.. టీఆర్ఎస్ అభ్యర్థులకు శ్రీరామరక్ష అని వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్ అన్నారు. హుజురాబాద్ మున్సిపాలిటీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని చూసి ఓటు వేయాలని ప్రజలకు మంత్రి ఈటెల పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలవలేరని, ఒకరో ఇద్దరో గెలిస్తే వారు అభివృద్ధి చేయలేరని చెప్పారు. ప్రజలు ఓట్లు వేస్తే వచ్చేవి పదవులని, ఆ పదవిని ప్రజల సేవ కోసం నేతలు ఉపయోగించాలన్నారు. ప్రజలు మెచ్చే పద్ధతిలో నాయకుల పని విధానం ఉండాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ప్రభుత్వానికి అండగా ఉండాలని మంత్రి కోరారు. హుజురాబాద్, జమ్మికుంట పట్టణాలను అభివృద్ధి చేసింది టీఆర్ఎస్ పార్టీ అని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే పనులు వేగంగా ముందుకు తీసుకుని వెళ్లగలమని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపల్ పరిధిలో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. టీఆర్ఎస్‌తోనే చొప్పదండి పట్టణం అభివృద్ధి చెందడంతోపాటు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో సంక్షేమ పథకాలు ఆ పార్టీల కార్యకర్తలకు మాత్రమే అందేవనీ, అర్హులైన లబ్ధిదారులకు మొండిచేయి చూపేవారని ఆరోపించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు నేరుగా అందేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జిల్లాలో చొప్పదండిని ఆదర్శ మున్సిపల్‌గా తీర్చిదిద్దే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇదిలావుంటే ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో టీఆర్ఎస్ జోరు పెంచింది. జిల్లా వ్యాప్తంగా కరీంనగర్ మినహా అన్ని మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి కావడం.. ఆయా పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో సందడి మొదలైంది. టీఆర్ఎస్ నుంచి ఖరారైన అభ్యర్థులు తమ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే పలు వాడల్లో ర్యాలీలు నిర్వహించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గత ఐదేళ్లలో మున్సిపాలిటీ ల్లో జరిగిన అభివృద్ధి పనులను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. గడపగడపకూ వెళ్తూ ఓటు అభ్యర్థి స్తున్నారు. పలు ప్రాంతాల్లో వాహనాలతో ప్రచారం మొదలైంది. మరోవైపు ఆయా మున్సిపాలిటీల్లో మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో ప్రచారం విషయంలో ఇప్పటికే వ్యూహాలను సిద్ధం చేసుకున్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో అభ్యర్థులను అధికారికంగా ప్రకటించకపోయినా ప్రచారాలు జోరుగా సాగిస్తున్నారు. ముఖ్యంగా వివిధ డివిజన్లలో టీఆర్ఎస్ నుంచి నామినేషన్లు దాఖలు చేసిన నాయకులు ప్రచారాల ఊపు పెంచారు. టీఆర్ఎస్ హయాంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరం సాగాలంటే మరోసారి టీఆర్ఎస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో మహిళలు ప్రతి ఇంటికీ వెళ్లి బొట్టు పెట్టి టీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. టీఆర్ఎస్ హయాంలోనే ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈసారి టీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీఆర్ఎస్ హయాంలో గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి సాగుతుందన్నారు.

భారీగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలు

ఏకంగా వేయి తగ్గిన పదిగ్రాముల రేటు

న్యూఢిల్లీ,జనవరి16(ఆర్ఎన్ఎ): పసిడి ప్రియులకు శుభవార్త. ఏకంగా రూ.1000 తగ్గిన బంగారం ధర మరోమారు అందుబాటులోకి వచ్చింది. బంగారం ధరలు.. ఎప్పుడు తగ్గుతూ.. పెరుగుతూ వచ్చే ధరలు.. గత నాలుగు రోజులుగా తగ్గుముఖం పట్టాయి. ఒక రోజు తగ్గితే మరో రోజు పెరుగుతాయి. ఇలా రోజు పెరుగుతూ తగ్గుతూ ఉండే బంగారం ఈ మధ్యకాలంలో దారుణంగా తయారు అయ్యింది. ఈ నేపథ్యంలోనే నేడు గురువారం హైదరాబాద్ మార్కెట్ లో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1000 రూపాయిల తగ్గుదలతో 41,060 రూపాయలకు చేరింది. అదేవిధంగా పది గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర కూడా 540 రూపాయిల తగ్గుదలతో 37,640 రూపాయలకు చేరింది. అయితే బంగారం ధరలు పడిపోగా వెండి ధర స్వల్పంగా పెరిగింది. దీంతో కేజీ వెండి ధర 100 రూపాయిలు పెరుగుదలతో 49,000 రూపాయిల వద్దకు చేరింది. అంతర్జాతీయంగా బంగారం కొనుగోలు దారుల నుంచి డిమాండ్ భారీగా తగ్గటంతో బంగారంపై ప్రతికూల ప్రభావం చూపిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కాగా మరో వైపు ఢిల్లీలో కూడా బంగారం ధరలు భారీగా తగ్గాయి. విజయవాడలో, విశాఖపట్నంలో కూడా ఇలాగె కొనసాగుతున్నాయి. రాబోయే రోజుల్లో బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. మరి ఈ బంగారం ధరలు ఇంకా ఎప్పుడు తగ్గుతాయో.. ఎప్పుడు పసిడి ప్రేమికులు బంగారం కావాల్సినంత కొంటారో చూడాలి. కాగా బంగారం కొనేవారు 30 శాతం తగ్గారని తాజా నివేదికలో తేలింది.

యధేచ్ఛగా కోడిపందాలు

పలు ప్రాంతాల్లో నిర్వహణ
చేతులు మారిన కోట్లాది రూపాయలు

కాకినాడ,జనవరి16(ఆర్ఎన్ఎ): కోనసీమలో కోడిపందాల కారణంగా కోట్లు చేతులు మారాయని అంటున్నారు. సంప్రదాయం పేరిట యధేచ్ఛగా పందాలు నిర్వహించారు. బరుల చెంతనే మద్యం ఏరులై పారింది. ప్రజాప్రతినిధుల అండతో జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు పెద్దఎత్తున చేపట్టారు. సంప్రదాయం ముసుగులో నిర్వహించిన పందేల్లో వేలాది కోళ్లు నేలకొరిగాయి. ఇదే సందర్భంలో పందెంరాయుళ్లు చెలరేగిపోయారు. జిల్లాలో ప్రధాన బరుల్లో నిర్వహించిన పందేల్లో రూ.కోట్లు చేతులుమారాయి. కోడిపందేల బరుల్లో రూ.10 కోట్లు చేతులుమారి ఉంటుందని అంచనా. అలాగే గుండాట, పేకాట తదితర జూదాల ద్వారా మరో రూ.కోటి వరకు చేతులు మారి ఉంటుందని భావిస్తున్నారు.వీటి ప్రాంగణాల్లోనే ఏర్పాటు చేసిన గుండాట, పేకాట యథేచ్ఛగా కొనసాగింది. అమలాపురం నియోజకవర్గంలో 10 పెద్దబరుల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. అల్లవరం మండలం గోడి వైనతేయ నది చెంత పందేలు నిర్వహించారు. ఇక్కడ ఆహ్లాదం కోసం బోటు షికారు, ఇతర ఏర్పాట్లు చేయడంతో పందేలను వీక్షించేందు కు మహిళలు, పిల్లలు సైతం తరలివచ్చారు. అల్లవరంలో పోలీస్‌స్టేషన్ సమీపంలోనే కోడి పందేలు యథేచ్ఛగా జరిగాయి. అమలాపురం పట్టణానికి ఆనుకునే గ్రామీణ మండల పరిధిలోనూ విచ్చలవిడిగా బరులు వెలిశాయి. ఉప్పలగుప్తంలోనూ పందేలు జోరుగా జరిగాయి. రాజోలు నియోజకవర్గంలో రాజోలు, శివకోడు పెద్దబరుల్లో పెద్దఎత్తున కోడి పందేలు జరగ్గా, మరో 12 గ్రామాల్లో కొత్త బరులు వెలిశాయి. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో భారీ స్థాయిలో పందేలు నిర్వహించారు. పి.గన్నవరం నియోజకవర్గంలో అక్కడక్కడా పందేలు జరిగాయి. ఆత్రేయపురం మండలంలో లొల్ల, పేరవరం, ర్యాలీ, వసంతవాడ తదితర గ్రామాల్లో పెద్దబరుల్లో పందేలు నిర్వహించారు. రాజానగరం నియోజకవర్గ పరిధిలోని కోరుకొండ కోటికేశవరంలో ఈసారి పెద్దబరి వెలిసింది. జగ్గంపేట నియోజకవర్గంలో గోకవరం, గండేపల్లి, కిర్లంపూడి పెద్దబరుల్లో పందేల జోరు కొనసాగింది. ప్రత్తిపాడు, రౌతుల పూడి, శంఖవరంతో పాటు అనపర్తి నియోజకవర్గంలో బిక్కవోలు, అనపర్తి, రంగంపేట తదితర గ్రామాల్లోనూ పందేలు నిర్వహించారు. రామచంద్రపురం, కాజులూరు, తుని నియోజవకవర్గంలో రెండు చోట్ల, కాకినాడ గ్రామీణ మండలం గొర్రెపూడి, తాళ్లరేవు మండల పరిధిలోని చినవలసల, పటవల ప్రాంతాల్లో పందేలు నిరాటంకంగా సాగాయి. కోడి పందేలు అనగానే అందరినోట కోజల అంటే పందెంలో ఓడిపోయిన కోళ్ల మాటే.. నిర్వాహకులు కోజల పంపిణీలో తలమునకలయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులకు వారి పరిధుల్లో కోజలు సిద్ధం చేయించి ప్రత్యేకంగా తరలించారు. పందేలకు తరలివచ్చిన సందర్శకుల నుంచి అంతే స్థాయిలో కోజలకు డిమాండ్ ఉండడంతో రూ.2,000 నుంచి రూ.10,000 వరకు పలికాయి. కలిసిపోయాయి. గత ఏడాది ముందుగా అనుకున్న ప్రాంతాల్లోనే కోడి పందేలు నిర్వహించిన పందెంరాయుళ్లు ఈసారి రాత్రికి రాత్రే కొత్త బరులను ఏర్పాటు చేశారు.జిల్లాలో ప్రధానంగా ఐ.పోలవరం మండలం మురమళ్ల గ్రామంలో ఆదివారం భారీ స్థాయిలో కోడిపందేలు నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రధాన బరికి వేలాది మంది తరలివచ్చారు. ఈ బరిలో కోడి పందేలను కొందరు ప్రజాప్రతినిధులు స్వయంగా పర్యవేక్షించడం గమనార్హం. ముమ్మిడివరం శాసనసభ్యుడు దాట్ల బుచ్చిబాబు పర్యవేక్షణలో ఇక్కడ కోడిపందేలు నిర్వహించారు. ఇంకా పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు పందేలను వీక్షించారు. పందలాదిగా తరలివచ్చిన కార్లు, వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, జనంతో మురమళ్లలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది.

రష్యా ప్రధాని మెద్వెదేవ్ రాజీనామా

అధ్యక్షుడు పుతిన్‌కు రాజీనామా లేఖ
రాజ్యాంగంలో మార్పులకు వీలుగా నిర్ణయం

మాస్కో,జనవరి16(ఆర్ఎన్ఎ): రష్యా ప్రధాని దిమిత్రి మెద్వెదేవ్ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు మెద్వెదేవ్ సమర్పించారు. మంత్రివర్గం, రాజ్యాంగంలో సంస్కరణలపై భేటీ తర్వాత మెద్వెదేవ్ ప్రధాని పదవికి రాజీనామా చేశారు. నూతన మంత్రివర్గం ఏర్పాటయ్యే వరకు పని చేయాలని మెద్వెదేవ్ మంత్రివర్గాన్ని అధ్యక్షుడు పుతిన్ కోరినట్లు తెలుస్తోంది. ఇక మెద్వెదేవ్‌తో పాటు తన మంత్రివర్గం రాజీనామా చేసే కంటే ముందు.. ప్రధాని జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. దిమిత్రి రాజీనామా నేపథ్యంలో ఆయనను ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ కౌన్సిల్‌కు డిప్యూటీగా నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా మెద్వెదేవ్‌ను పుతిన్ ప్రశంసించారు. మెద్వెదేవ్ దేశం కోసం గొప్ప కృషి చేశారని పుతిన్ కొనియాడారు. 2012 నుంచి రష్యా ప్రధానిగా మెద్వెదేవ్ కొనసాగుతున్నారు. అంతకుముందు 2008 నుంచి 2012 వరకు రష్యా ప్రెసిడెంట్ గా దిమిత్రి సేవలందించారు. ఇదిలావుంటే రష్యా ప్రధాన మంత్రి దిమిత్రి మెద్వెదేవ్ తన పదవికి రాజీనామా చేసినట్లు టాస్ న్యూస్ ఏజెన్సీ ధృవీకరించింది. దిమిత్రితో సహా రష్యా ప్రభుత్వ మంత్రిమండలి మొత్తం పదవుల నుంచి వైదొలగినట్లు పేర్కొంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బుధవారం జాతిని ఉద్దేశించి మాట్లాడిన క్రమంలో దిమిత్రి రాజీనామా ప్రకటన చేయడం గమనార్హం. పుతిన్ మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం ఉందని.. ఈ మేరకు ప్రధాని, మంత్రుల అధికారాలను మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందంటూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాని దిమిత్రి తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. ఈ మేరకు దిమిత్రి మాట్లాడుతూ... 'దేశ భవిష్యత్తుకై అధ్యక్షుడు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. ఇకపై తదుపరి నిర్ణయాలు ఆయనే తీసుకుంటారు' అని పేర్కొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం

అధికారులకు పక్కా సూచనలు చేసిన కలెక్టర్

కామారెడ్డి,జనవరి16(ఆర్ఎన్ఎ): మున్సిపాలిటీ ఎన్నికలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇసి ఆదేవాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఇందుకు ఉపక్రమించింది.పురపాలక ఎన్నికల కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సత్యనారాయణ అధికారులకు సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేయనున్న ఎన్నికల రిసెప్షన్ కౌంటర్, ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపడుతున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్న

నిర్మల్ గెలుపు నల్లేరుమీద నడకే

టిఆర్ఎస్‌కు తిరుగులేదన్న ఇంద్రకరణ్ రెడ్డి

ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మంత్రి

నిర్మల్,జనవరి16(ఆర్ఎన్ఎ): నిర్మల్ మున్సిపాలిటీని టీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుచుకుంటుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. పట్టణంలో టీఆర్ఎస్‌కు తిరుగు లేదన్నారు. పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని అన్నారు. గురువారం మంత్రి 3వ వార్డు రాంభాగ్, బంగల్ పేట్‌లో టీఆర్ఎస్ అభ్యర్థులు రమాదేవి, పద్మాకర్ తరపున ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ.. ప్రచారం ముమ్మరం చేశారు. మంత్రి ప్రచారంలో భాగంగా టీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు, చిన్నారులు సైతం ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఓటర్లతో మాట్లాడుతూ.. గత 70 ఏళ్లలో జరగని అభివృద్ధి, టీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేవలం 5 ఏళ్లలో చేసి చూపించామని మంత్రి ప్రజలకు వివరించారు.

నిర్మల్‌లోని ప్రతి వార్డు టీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. తద్వారా నిర్మల్ మున్సిపల్ పీఠంపై గులాబీ జెండా ఎగురవేయాలని ఆయన ఓటర్లకు విన్నవించారు. రాబోయే రోజుల్లో నిర్మల్ పట్టణాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసుకుందామని మంత్రి ఈ సందర్భంగా ప్రజలతో అన్నారు.

నిర్మల్ పట్టణ అభివృద్ధే టీఆర్ఎస్ పార్టీ ముఖ్య ఎజెండా అని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్మల్ మున్సిపాల్టీలో పోటీ చేసే 42 వార్డుల టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు బీ-ఫారాలను అందజేశారు. నిర్మల్ మున్సిపాల్టీలో మరో రూ. 52 కోట్ల నిదులు ఉన్నాయని ఎన్నికల అనంతరం ఖర్చుచేయనున్నట్లు తెలిపారు. నిర్మల్ పట్టణాన్ని కోట్లాది రూపాయలతో అబివృద్ధి చేశామని తెలిపారు. 36 వార్డుల్లో సీసీ రోడ్లు,డ్రైనేజీల నిర్మాణాలతో పాటు,కుల సంఘాలకు భవన నిర్మాణాలకు నిధులు మంజూరుచేసినట్లు చెప్పారు. పార్టీలో పోటీ ఎక్కువగా ఉందని సర్వే ఆధారంగానే అభ్యర్థులకు సీట్లను కేటాయించినట్లు తెలిపారు. టికెట్లు రాని వారు నిరాశ చెందకుండా పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అబివృద్ధి పనులను ప్రజలకు వివరించి ఓట్లను అడుగాలని సూచించారు. ఎన్నికల ఖర్చుపై దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరినీ ఓటు అడిగి ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. అన్ని వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించేలా చూడాలని, ప్రతి వార్డుకు ఇన్‌చార్జిని నియమించామన్నారు.

నిర్మల్ పట్టణంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

కేరళ సర్కార్ తీరుపై గవర్నర్ అసహనం

తనకు తెలియపర్చకుండా సుప్రీంకు వెళతారా?

పౌరచట్టంపై సుప్రీంను ఆశ్రయించడంపై అభ్యంతరం

తిరువనంతపురం,జనవరి16 (ఆర్ఎన్ఎ): కేరళ ప్రభుత్వంపై ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లే ముందు తనను సంప్రదించకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. ఇది పోట్రాకాల్ ఉల్లంఘనేనని అన్నారు. దీనిపై గురువారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, సీఏఏను సుప్రీంకోర్టులో సవాలు చేసే ముందు తన ఆమోదం తీసుకోవడం కానీ, కనీసం తనకు సమాచారం ఇవ్వడం కానీ కేరళ ప్రభుత్వం చేయలేదన్నారు. ప్రోటోకాల్ పరంగానే కాకుండా కనీస మర్యాదను కూడా ప్రభుత్వం పాటించలేదన్నారు. గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు వెళ్లవచ్చా అనే అంశాన్ని తాను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అయితే కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టు వెళ్లడంపై తనకేమీ అభ్యంతరం లేదు. అయితే ఆ విషయం ముందుగా నాకు చెప్పి ఉండాల్సింది. రాజ్యాంగపరమైన బాధ్యతల్లో నేను ఉన్నాను. పత్రికల్లో వార్తలు చూసిన తర్వాతే నాకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసిన విషయం తెలిసింది. నేను ఎంతమాత్రం రబ్బర్ స్టాంప్‌ను కాను' అని ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ముందు, పౌరసత్వ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ కేరళ ప్రభుత్వం రెండ్రోజుల క్రితం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సమానత్వం, రాజ్యాంగ అధికరణలను, మౌలిక సూత్రమైన లౌకికత్వాన్ని ఉల్లంఘించేలా పౌరసత్వ చట్టం ఉందని తన పిటిషన్‌లో కేరళ సర్కార్ పేర్కొంది. ఈ చట్టంపై ఇప్పటికే సుమారు 60 పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ఈ నెల 22న సుప్రీంకోర్టు విచారణ జరుపనుంది.

ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన రవీంద్ర సింగ్

ఇంట్లో సోదాల్లో కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

దర్యాప్తు చేస్తున్న అధికారులు

న్యూఢిల్లీ,జనవరి16(ఆర్ఎన్ఎ): ఖాకీ ఉగ్రవాది దవీందర్ సింగ్ ఇంట్లో శ్రీనగర్ భారత సైనిక హెడ్‌క్వార్టర్స్ 15 కార్ప్స్ మ్యాప్‌తోపాటు పలు కీలక డాక్యుమెంట్లు దొరకడం సంచలనం రేపింది. హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులను కారులో తరలిస్తూ పట్టుబడిన శ్రీనగర్ విమానాశ్రయ డీఎస్పీ దవీందర్ సింగ్ ఇంట్లో తనిఖీలు జరిపిన సైనికాధికారులకు ఆర్మీ మ్యాప్‌తోపాటు కీలక డాక్యుమెంట్లు దొరికాయి. దవీందర్ సింగ్ ఈ నెల 11వతేదీన తన ఇంట్లో ముగ్గురు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించాడని జమ్మూకశ్మీర్ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. శ్రీనగర్ నగరంలోని బదామీ బాగ్ కంటోన్మెంటులోని ఆర్మీ 15 కార్ప్స్ హెడ్ క్వార్టర్స్ పక్కనే ఖాకీ ఉగ్రవాది దవీందర్ సింగ్ ఇల్లు ఉంది. తన ఇంట్లోనే ఉగ్రవాదులకు దవీందర్ ఆశ్రయం కల్పించాడని దర్యాప్తులో తేలడంతో ఆర్మీ అధికారులు షాక్‌కు గురయ్యారు. రవీందర్ ఇంట్లో సోదాలు జరిపిన ఆర్మీ అధికారులకు లెక్క తేలని రూ.7.5 లక్షలు లభించాయి. కశ్మీర్ రాష్ట్రంలో ఉన్న దవీందర్ బంధువుల ఇళ్లలోనూ కేంద్ర భద్రతాబలగాలు గాలింపు చేపట్టాయి. శ్రీనగర్ నగరంలోని ఇందిరానగర్ ప్రాంతంలో దవీందర్ విలాసవంతమైన భవనం నిర్మించాడని దర్యాప్తులో వెల్లడైంది. శ్రీనగర్ నగరంలోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్ ప్రహరీగోడ ఆనుకొని దవీందర్ 2017 వ సంవత్సరం నుంచి విలాసవంతమైన భవనాన్ని నిర్మిస్తున్నాడని తేలింది. దవీందర్ సొంత భవనం నిర్మాణంలో ఉండటంతో అతని బంధువు ఇంట్లో గత ఐదేళ్లుగా అ÷-దదెకు నివాసముంటున్నాడని దర్యాప్తులో వెల్లడైంది. గతంలో ఇతని ఇంట్లో రెండు పిస్టళ్లు, ఒక ఏకే 47 రైఫిల్, పెద్దఎత్తున తూటాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రదవీందర్‌కు ఉగ్రవాదులతో ఉన్న సంబంధాలపై సరైన సమయంలో వివరాలు వెల్లడిస్తామని జమ్మూకశ్మీర్ డీజీపీ దిల్ బాగ్ సింగ్ చెప్పారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపేందుకు వీలుగా దర్యాప్తు బాధ్యతను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి అప్పగించామని డీజీపీ దిల్‌బాగ్‌సింగ్ వివరించారు.

ఆరోపణలు రుజువు చేస్తే నా పదవికి రాజీనామా చేస్తా: పుదుచ్చేరి సీఎం

పుదుచ్చేరి, జనవరి 16: లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి, కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యే ఎన్ ధనవేలు తనపై చేస్తున్న ఆరోపణలపై పుదుచ్చేరి సీఎం నారాయణ స్వామి తీవ్రంగా బదులిచ్చారు. తాను, తన కుమారుడు ఓ భూమిని లాక్కున్నట్లు చేసిన ఆరోపణలను సీఎం నారాయణ స్వామి ఖండించారు.

కిరణ్‌బేడీ, ధనవేలు చేస్తున్న ఆరోపణలు రుజువు చేస్తే సీఎం పదవికి రాజీనామా చేస్తా. ఒకవేళ నాపై చేసిన ఆరోపణలు నిరూపించకపోతే వారు బహిరంగంగా క్షమాపణలు చెప్పి వారి పదువుల్లో నుంచి తప్పుకోవాలని సీఎం నారాయణ స్వామి సవాలు విసిరారు. ధనవేలుతో సమావేశమనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ మీడియా సమావేశంలో..ఎలాంటి డాక్యుమెంట్లుకానీ, సాక్ష్యాధారాలు కాని లేకుండా సీఎం నారాయణస్వామిపై ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

సరదాగా సాగిన సంక్రాంతి

అలరించిన ముగ్గుల పోటీలు

ఆగని కోడిపందాలు

ఏలూరు,జనవరి16(ఆర్ఎన్ఎ): సంక్రాంతి పండుగ సంబరాలు నగరమంతా రంగవల్లులతో కళకళలాడాయి. ముగ్గులు,ఎడ్ల పందాలు అలరించాయి. రథం ముగ్గును వేసి ఆకట్టుకున్నారు. సూర్యుడు దక్షిణాయం నుంచి ఉత్తరాయణంలో ప్రవేశించేలోపు రథం కార్యక్రమం ఉంటుందని, రథం ముగ్గును వేయాలన్న సంకల్పంతో స్థానికులంతా నిర్విరామంగా శ్రమిస్తూ ముగ్గును రంగులతో అలంకరించారు. సంక్రాంతి ప్రాముఖ్యతను ప్రతిఒక్కరికి తెలియజేయాలనే సంకల్పంతోనే ముగ్గును వేస్తున్నామని స్థానికులు చెప్పారు. సంక్రాంతి పండగ గ్రామాలకు సరికొత్త శోభను తెచ్చిపెట్టింది. ఆయా గ్రామాలకు వచ్చిపోయే వాహనాలతో జిల్లా వ్యాప్తంగా రహదారులు సందడిగా మారాయి. ఆర్టీసీ బస్సులు పండగ రోజు రద్దీని తలపించాయి. జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. ఎక్కడికక్కడ సంప్రదాయ క్రీడలతో యువత కదం తొక్కింది. వేకువజామునే లేచి రోడ్లపై కట్టెల పొయ్యిలతో భోగిమంటలు వేశారు. ఇళ్ల ముందు రంగవల్లులు, గొబ్బిళ్లు, ఏ ఇంట చూసినా పిండివంటల ఘుమఘుమలే కనిపించాయి. పల్లె, పట్టణం అని తేడా లేకుండా వాడవాడలా భోగి పండగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా చేసుకొన్నారు. గ్రామాల్లో చూసినా హరిదాసులు, సన్నాయి మేళాలు, గంగిరెద్దుల ఆట, కోడి పందేల జోరుతో పండగ వాతావరణం ఉట్టిపడింది. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంక్రాంతి పండగకు ధాన్యరాశుల రాకతో రైతన్నలు ఆనందోత్సాహాలతో ఎద్దుల పందేలకు సై అంటే సై అంటూ బండలాగుడు పందేలకు శ్రీకారం చుట్టారు. భోగి మంటలు వేసి ప్రారంభించారు. గంగిరెద్దుల విన్యాసాలను తిలకించారు. హరిదాసులకు బియ్యం, కూరగాయలను ఇచ్చారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. బొంగరాలు, గోలీలాటలు ఆడారు. గాలి పటాలను ఎగురవేశారు. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా అచ్చం గ్రామాల్లో జరిగే విధంగా సంబరాలు జరుపుతున్నా మన్నారు. పలుప్రాంతాల్లో కూచిపూడి నృత్యప్రదర్శన, తప్పెట గుళ్లు,దక్షిణ మధ్య రైల్వేవారి డప్పుల ప్రదర్శన, మహిళల సంప్రదాయక ప్రదర్శన, జానపద నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. జిల్లా పోలీసులు ఈసారి కోడి పందేలు సంప్రదాయంగా నిర్వహించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో కత్తులు కట్టకూడదని గట్టి నిఘా ఏర్పాటు చేశారు. అయినా కొన్నిచోట్ల ప్రజాప్రతినిధుల జోక్యంతో కత్తులు కట్టి మరీ కోడి పందేలు నిర్వహించారు. గ్రామాలతో పాటు లంకల్లో పెద్దఎత్తున వీటిని ఏర్పాటు చేశారు. పందేలు చూడటానికి జనం పెద్దఎత్తున తరలివచ్చారు. పోలీసులు నిర్వాహకులను ఎక్కడికక్కడ బైండోవర్లు చేసుకుని వారి నుంచి హామీని పొందటంతో కొంతవరకు కోడిపందేలను నిలువరించగలిగారు. కొన్నిచోట్ల కత్తులుకట్టి కోడి పందేలు ఆడినట్లు ఫిర్యాదులు వచ్చాయని, విచారణ అనంతరం నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు. సంప్రదాయ ఆటలైన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, కుస్తీపట్లు, రాళ్లు ఎత్తటం, కోలాటం వంటివి ఆడారు.

షాపు తెరుస్తుండగా బంగారు నగలు చోరీ

నిజామాబాద్ ఘటనపై దర్యాప్తు

నిజామాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): 15 లక్షల రూపాయల విలువైన బంగారం అపహరణకు గురయింది. జిల్లాలోని డిచ్‌పల్లిలో రూ. 15 లక్షల విలువైన బంగారం చోరీకి గురైంది. బంగారం షాపు యజమాని దుకాణం తెరుస్తుండగా.. ద్విచక్రవాహనంపై అతడిని అనుసరించిన దొంగలు బంగారం ఉన్న బ్యాగును ఎత్తుకెళ్లారు. బ్యాగులో 30 తులాల బంగారంతో పాటు 18 కిలోల వెండి ఉన్నట్లు యజమాని తెలిపాడు. బంగారం, వెండితో పాటు 2.5 లక్షల నగదు కూడా ఉన్నట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. సిసి కెమెరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బిజెపి అంటే భయపడుతున్న టిఆర్ఎస్

తమ పార్టీ అభ్యర్థులను బెదిరించి కేసులు

ఎంఐఎం,టిఆర్ఎస్ తోడుదొంగలు: ఇంద్రసేనా రెడ్డి

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్‌కు బీజేపీ భయం పట్టుకుందని ఆ పార్టీ సీనియర్ నేత ఇంద్రసేనారెడ్డి విమర్శించారు. ఎన్నికల కమిషన్ కేసీఆర్ చేతిలో కీలుబొమ్మగా మారిందని, ఎంఐఎం, టీఆర్ఎస్ తోడుదొంగలని ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థుల్ని కిడ్నాప్ చేస్తున్నారని, ఖమ్మం, వరంగల్, నల్లగొండ, పరకాలలో..బీజేపీ అభ్యర్థులను టార్గెట్ చేసి బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎంఐఎం గుండాలు బీజేపీ కార్యకర్తలపై దాడి చేస్తున్నారని, పోలీసులు అధికార పార్టీకి వంతపాడుతు న్నారని విమర్శించారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించ కుపోతోన్న ఏపీ సీఎం జగన్..తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఇంద్రసేనారెడ్డి అన్నారు. దీనిని ఎదురిచడంతో టీఆర్ఎస్ పార్టీకి బీజేపీ భయం పట్టుకుందని అన్నారు. టిఆర్ఎస్ పార్టీకి ధీటుగా ప్రజల మద్దతు తమకుందని అందుకే గులాబీ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో భయపడుతుందని అన్నారు. బిజెపి అభ్యర్థులను ఎన్నికలలో నిలపడొద్దని టీఆర్ఎస్ వాళ్లు వార్గింగ్ ఇవ్వడంతో పాటు వారి కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై.. పోలీసులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని చెప్పారు. టీఆర్ఎస్ అభ్యర్థులు గెలవక పోతే బీజేపీ నాయకుల అంతుచూస్తామని బెదిరిస్తున్నట్లు ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఎన్నికల కమిషన్ సీఎం కేసీఆర్ చేతిలో కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికలను బలవంతంగా ఏకగ్రీవం చేయాలనుకునే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎంఐఎం గుండాలు బీజేపీ కార్యకర్తలను టార్గెట్ చేసి విధ్వంసం సృష్టిస్తున్నారని చెప్పారు. అధికార పార్టీకి పోలీసులు వంతపాడుతున్నారని అన్నారు. కేసీఆర్ ఆదేశాలతోనే బీజేపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని చెప్పారు.

ఇండియా తిరిగి పుంజుకుంటుంది: గంగూలీ

న్యూఢిల్లీ, జనవరి 16: ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో ఓడిన టీమిండియా తిరిగి పుంజుకుంటుందని బీసీసీఐ ప్రెసిడెంట్ సౌరవ్ గంగూలీ ఆశాభావం వ్యక్తం చేశాడు. భారత్ చాలా బలమైన జట్టు. స్వదేశంలో భారత్‌ను ఓడించడం ఏ జట్టుకైనా సవాలే. కానీ, తొలి మ్యాచ్‌లో దీనికి భిన్నంగా జరిగిందని గంగూలీ అన్నారు. భారత్ గత మ్యాచ్ అనుభవాలను మరిచి, తర్వాతి రెండు వన్డేలు గెలిచి 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. గతంలో భారత్ 2-0తో వెనుకంజలో ఉన్నప్పటికీ.. మిగితా మ్యాచ్‌లు గెలిచి.. సిరీస్ గెలిచిన సందర్భాలున్నాయని గంగూలీ గుర్తు చేశారు. తదుపరి మ్యాచ్‌లకు కెప్టెన్ విరాట్ కోహ్లికి, జట్టు సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

కాగా, ముంబయిలోని వాంఖెడే మైదానంలో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా.. ఆస్ట్రేలియాకు 256 పరుగుల లక్ష్యం నిర్దేశించింది. ఇండియా తరఫున ఓపెనర్ శిఖర్ ధావన్, వన్‌డౌన్ బ్యాట్స్‌మెన్ లోకేష్ రాహుల్ మాత్రమే రాణించారు. కెప్టెన్ కోహ్లి సహా మిగితా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. అనంతరం, లక్ష్య ఛేదనకు దిగిన ఆసీస్ ఓపెనర్లు.. డేవిడ్ వార్నర్, ఆరోన్ ఫించ్ సెంచరీలతో చెలరేగి, వికెట్ నష్టపోకుండా మ్యాచ్ గెలిపించారు.

స్వదేశంలో భారత్ 10 వికెట్ల తేడాతో పరాజయం పాలవడం ఇది రెండోసారి మాత్రమే. ఇంతకు ముందు 2005లో దక్షిణాఫ్రికాతో ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. టీమిండియా చరిత్రలో 10 వికెట్లతో తేడాతో మ్యాచ్ ఓడడం ఇది ఐదోసారి.

ప్రచారంలో దిగిన టిఆర్ఎస్ నేతలు

ప్రచార సరళిని తెలుసుకుంటున్న మంత్రి వేముల

నిజామాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): ఇక అభ్యర్థులు ఎవరన్నది తేలడంతో ఇప్పుడు అందరి దృష్టి దానిపైనే ఉంది. టీఆర్ఎస్ మాత్రం అభ్యర్థుల జాబితాను ప్రకటించేసి ప్రచార బరిలో దిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశిశ్ గుప్తా పలు డివిజన్లలో ప్రచారం మొదలుపెట్టారు. పలు డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేశారు. టీఆర్ఎస్‌కు ఎందుకు ఓటేయాలో వివరిస్తూ జరిగిన అభివృద్ధిని కాలనీవాసుల కళ్ల ముందు ఉంచారు. ప్రతిపక్షాల్లో అభ్యర్థులెవరో తేలక ఇంకా డోలాయమానంలో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో టీఆర్ఎస్ జనంలోకి వెళ్లిపోయింది. ప్రచార పర్వంలో బిజీ అయిపోయింది. అన్ని వర్గాలను కలుస్తూ టీఆర్ఎస్‌ను గెలిపించాలని ముమ్మర ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఈ పరిణామం ప్రతిపక్షాల్లో గుబులు రేపుతున్నది. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్ని మున్సిపాలిటీల ప్రచార సరళి పై ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నారు. వేల్పూర్‌లోని తన నివాసంలోనే తిష్ట వేసి నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలతో తన నియోజకవర్గంలోని భీమ్‌గల్ మున్సిపాలిటీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. పోటీలో నిలిచిన అభ్యర్థులంతా ప్రచార పర్వంలో బిజీ అయ్యారు. ఈ నెల 22న పోలింగ్ ఉన్న నేపథ్యంలో 20 వరకు ప్రచారం నిర్వహించుకునే వెసులుబాటు ఉండడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు టీఆర్ఎస్ దూకుడుగా ప్రచారం నిర్వహిస్తున్నది.

స్వగ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

పాల్గొన్న ఎంపి విజయసాయి రెడ్డి

నెల్లూరు,జనవరి16(ఆర్ఎన్ఎ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి శుక్రవారం నెల్లూరు జిల్లాలో పర్యటించారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. తన స్వగ్రామమైన తాళ్లపూడిని మోడల్ గ్రామంగా తీర్చిదిద్ది.. సకల సదుపాయాలు కల్పించేందుకు రూ.15 కోట్లతో చేపట్టిన వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్ భాషా, మంత్రి అనిల్‌కుమార్, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దుర్గాప్రసాద్.. ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, కాకాణి గోవర్ధన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు అభ్యర్థుల్లో 300 మందికి నేరచరిత్ర

గుర్తించిన పోలీసు నియామక మండలి

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల్లో కొంత మందిపై కేసులు ఉన్నట్లు తెలంగాణ పోలీస్ నియామక మండలి గుర్తించింది. మొత్తం 300 మందికి నేర చరిత్ర ఉన్నట్టు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించారు. వీరిలో దాదాపు 100 మంది అభ్యర్థులు తమపై ఉన్న కేసుల విషయాన్ని దాచి పెట్టారు. ఎంపికైన అభ్యర్థుల్లో పలువురిపై పోక్సో, హత్య కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వారంలో పోలీస్ కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం కానున్న తరుణంలో కేసులున్న వాళ్లకు సంబంధించి ఉన్నతాధికారులు ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. పోలీస్ నియామక మండలి 2018 మే నెలలో సుమారు 17వేల మంది కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రాథమిక అర్హత పరీక్ష, దేహదారుఢ్య పరీక్ష, ప్రధాన పరీక్షల్లో అర్హత సాధించిన వాళ్లను కానిస్టేబుళ్లుగా ఎంపిక చేశారు. 13,373 మంది పురుషులు, 2652 మంది మహిళలు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. త్వరలో వీరందరికీ 9 నెలల పాటు శిక్షణ ప్రారంభం కానున్న తరుణంలో పోలీస్ నియామక మండలి ఆధ్వర్యంలో అభ్యర్థుల పూర్తి వివరాలకు సంబంధించి చేపట్టిన విచారణలో ఈ విషయం వెల్లడైంది. అయితే, అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమపై ఉన్న కేసుల గురించి పేర్కొనాల్సి ఉంటుంది. కానీ దాదాపు 100 మంది అభ్యర్థులు తమపై కేసుల గురించి దాచిపెట్టినా.. పోలీస్ నియామక మండలి ఆధ్వర్యంలో చేయించిన వ్యక్తిగత పరిశీలనలో ఈ కేసులు విషయాలు బయటపడ్డాయి. దీంతో వాళ్లను శిక్షణకు అనుమతించాలా? వద్దా? అనే అంశంపై పోలీస్ నియామక మండలి ఉన్నతాధికారులు చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

మంత్రులకు తెలంగాణలో పని లేదు

తలసాని తీరు అభ్యంతరకరం : రావుల

హైదరాబాద్,జనవరి16(ఆర్ఎన్ఎ): మంత్రులకు తెలంగాణలో పని లేదని, అందుకే కోడి పందాల కోసం ఏపీలో తిరుగుతున్నారని టీటీడీపీ నేత రావుల చంద్రశేఖర్ రెడ్డి ఎద్దేవా చేశారు. తలసాని తదితరులు కోడిపందాలు ఆడడానికి వెళ్లడాన్ని ఆయన తప్పుపట్టారు. గురువారం ఆయన మీడియాతో మాట్టాడుతూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు రాజకీయ జన్మనిచ్చిన పార్టీకి..రిటర్న్ గిఫ్ట్ ఇస్తారా? అంటూ మండిపడ్డారు. ఏపీలో ప్రజలు ఇబ్బంది పడుతుంటే.. తెలంగాణ మంత్రులు వెళ్లి పుండు మీద కారం చల్లుతున్నారని, మంత్రి తలసాని సభ్యతగా వ్యవహరిస్తే బాగుంటుందని ఆయన సూచించారు. అక్కడ రాజధాని తరలింపునకు వ్యతిరేకంగా ప్రజలు పండగకు దూరంగా ఆందోళనలు చేస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తెలంగాణ మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని రావుల స్పష్టం చేశారు. ప్రజలు నిజాగ్రహించాలని అన్నారు. ఓట్ల వేటలో టిఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు.

కన్నుల పండువగా ప్రభలతీర్థం

కాకినాడ,జనవరి16(ఆర్ఎన్ఎ): కోనసీమలో ప్రభల తీర్థం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కనుమ పండగను పురస్కరించుకుని అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో గురువారం ఏకాదశ రుద్రులు కొలువుదీరారు. ఈ మేరకు పదకొండు గ్రామాల నుంచి ప్రభలు జగ్గన్న తోటకు ఊరేగింపుగా బయలు దేరాయి. ఏకాదశ రుద్రులను చూసేందుకు జనం వేలాదిగా తరలి వచ్చారు. కాగా ప్రతియేటా సంక్రాంతి సందర్భంగా కోనసీమలోని జగ్గన్నతోట తదితర ప్రాంతాల్లో ఈ ప్రభల తీర్థాన్ని ఘనంగా నిర్వహిస్తారు. కనుమ నాడు జగ్గన్న తోటలో ఏకాదశ రుద్రులు లోక కళ్యాణార్థం కోసం చర్చిస్తారని ప్రతీతి. సుమారు నాలుగు వందల సంవత్సరాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది.

పండగపూట విషాదం

బైక్‌ను ఢీకొట్టిన మంత్రి వనిత కారు, ఒకరు మృతి

ఏలూరు,జనవరి16(ఆర్ఎన్ఎ): మంత్రి కాన్వాయ్ ఢీకొని ఓ ద్విచక్రవాహనంపై వెళ్తున్న వెంకట్రావ్ అనే వ్యక్తి మృతి చెందాడు. భీమడోలు జాతీయ రహదారిపై మంత్రి కాన్వాయ్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఏపీ మంత్రి తానేటి వనిత కాన్వయ్‌లోని ఓ కారు జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో నడరు ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని అధికారులు హుటాహుటిన దగ్గరలోని ఏలూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో ఆ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సంక్రాంతి రోజు జరిగింది.

ఫిబ్రవరిలో ట్రంప్ భారత్ పర్యటన..?

తేదీలను